విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 226 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఫిబ్రవరి 2025 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|




## పదో తరగతి పరీక్షల్లో కీలకమార్పు

- విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ సూచన
- మార్చి 6 నుంచి మార్చి 15వ తేదీ ప్రీఫైనల్...
- మార్చి 21 నుంచి ఏప్రీల్ 4 వరకు పబ్లిక్ పరీక్షలు

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి వార్షిక పరీక్షల్లో కీలక మార్పు తీసుకురానున్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఓఎంఆర్ పత్రంలో వివరాలను నింపడం నుంచి తదితర అంశాలను

-మిగతా 2 లో




## అమెరికా చేరుకున్న ప్రధాని మోడీ

- రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా తదితరుల స్వాగతం
- ద్వైపాక్షిక సంబంధాలపై ట్రంప్‌తో చర్చలు
- ఎలన్‌మస్క్‌తోనూ చర్చించే ఛాన్స్
- చారిత్రక బ్లెయిర్ హౌజ్‌లో మోడీకి బస

వాషింగ్టన్,

అమెరికాలో రెండు రోజుల పర్యటన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాషింగ్టన్‌కు చేరుకున్నారు. అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, ఇతర అధికారులు ప్రధాని మోదీని విమానాశ్రయంలో స్వాగతించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

-మిగతా 2 లో



## 19న బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

- కేసీఆర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు
- ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించే అవకాశం

హైదరాబాద్,

ఈ నెల 19న భారత రాష్ట్ర సమితి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరుగనున్నది. తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశాశం జరుగనుంది. త్వరలోనే పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుక జరుగనున్నది. ఈ క్రమంలో నే విస్తృత స్థాయి కార్యవర్గాన్ని సమావేశ పరచాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు భేటీ నిర్వాహణకు సంబంధించి పార్టీ కార్యవర్గ

-మిగతా 2 లో




# సాంకేతిక రంగంలో సత్తా చాటాలి

**500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్య**



- మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు ఉపాధి..
- 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్య
- మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించడం గర్వంగా ఉంది
- మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని అవకాశాలు : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,

యువత సాంకేతికరంగంలో తమ సత్తాను చాటాలని, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించనున్నాయని తెలంగాణ

-మిగతా 2 లో

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

- కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ,

బీజేపీ పాలిత రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. సీఎం బీరేన్ సింగ్ రాజీనామా చెయ్యడంతో

-మిగతా 2 లో





## బీఆర్ఎస్ పాలనలో యువతను మత్తులో ముంచారు

- క్యాసినో జూదానికి కేంద్రంగా చేశారు
- కేటీఆర్, సంతోష్ కనుసన్నల్లో ఫామ్‌హౌజ్ దందాలు
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపణలు

హైదరాబాద్,

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఫాంహౌజ్ కోళ్ళపందాల ఘటన దుమారం రేగుతోంది. బీఆర్ఎస్ హయాంలో కేటీఆర్, సంతోష్ కనుసన్న ల్లోనే పోచంపల్లి ఫాంహౌజ్ దందా నడిచిందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో యువతను మత్తు లో ముంచారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని క్యాసినో హబ్ గా కేటీఆర్ మార్చారని విమర్శించారు. బీఆర్ ఎస్ హయాంలో రాష్ట్రంలో రాక్షసపాలన సాగింది. కేటీఆర్ డ్రగ్స్ తో తెలంగాణను నాశనం చేశారు.. బినామీలకు క్యాసినో, కోళ్ల పందాలు అప్పగించారని అన్నారు.

-మిగతా 2 లో



## పార్లమెంట్ ముందుకు కొత్త ఐటీ చట్టం

- నిరసలన మధ్యే ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్
- విపక్షాల వాకౌట్...లోక్‌సభ మార్చి 10కి వాయిదా

న్యూఢిల్లీ,

ప్రస్తుతం అమలులో ఉన్న దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురానుంది. దీనిలో భాగంగా ఆదాయపు పన్ను (ఐటీ) నూతన బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చింది. విపక్షాల నిరసనల మధ్యే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును లోక్‌సభలో

-మిగతా 3 లో



## బీసీ జాబితాలో ముస్లింలను

# చేరిస్తే ఊరుకోం

- మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే
- కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్

**స్థానిక ఎన్నికలు నిర్వహించలేని దద్దమ్మ రేవంత్**

హైదరాబాద్,

మతపరమైన రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమా[illegible] జాబితాలో ముస్లింలను చేరిస్తే ఆమోదించే ప్రసక్తే లేదని అన్నారు. ఈ సందర్భంగా [illegible] మీడియాతో మాట్లాడారు. రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రంపై నెట్టాలనుకోవడం మూర్ఖత్వమని విమర్శ[illegible] రిజర్వేషన్లు అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ కు లేదనేది తేట తెల్లమైందన్నారు. బిసిల్లో ము[illegible] చేర్చడం వల్ల బిసిలకు రిజర్వేషన్లు తగ్గుతాయని చెప్పారు. బిసిలకు కాంగ్రెస్ మరింత అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే బిసి జాబితా నుంచి ముస్లింలను తొలగించాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్

-మిగతా 2 లో

# కులగణనలో ఆదర్శంగా నిలిచిన తెలంగాణ

సర్వేలో పాల్గొనని వారికోసం మరో ఛాన్స్
మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**కరీంనగర్, ప్రజా స్వేచ్ఛ**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే రాష్ట్రాలన్నింటికీ మార్గదర్శకంగా నిలిచిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొంత మంది సర్వేలో పాల్గొనకుండా తమ సమాచారాన్ని ఇవ్వకపోవడంతో ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. భారాస నేతలు చెబుతున్నట్లు ఇది రీసర్వే కాదని పొన్నం స్పష్టం చేశారు. సర్వేలో పాల్గొనని భారాస నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యం మీద విశ్వాసం ఉంటే భారాస అగ్ర నేతలు సర్వేలో పాల్గొని తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. 'భాజపా వ్యాపారులస్తుల అనుకూల పార్టీ. కులగణన, బీసీ, ఎస్సీ వర్గీకరణ ఆ పార్టీకి ఇష్టం లేదు. ప్రజల అకాంక్షలకి అనుగుణంగా తెలంగాణలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి. సర్వే పూర్తయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి. సామాజిక మార్పు కలిగించే నిర్ణయం ఇది. రాజకీయ విమర్శల కొసమే భాజపా నేతలు బీసీలు, ముస్లింలపై విమర్శలు చేస్తున్నారు. ముస్లిం కమ్యూనిటీలోని పేద ముస్లింలు బీసీలోనే కొనసాగుతున్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తాం. బలహీన వర్గాలపై చిత్తశు ద్ధి ఉంటే శాసనసభలో బిల్లును అడ్డుకొవద్దు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# హైదరాబాద్‌లో గూగుల్ ఎఐ సెంటర్ ఏర్పాటు

-సిఎం రేవంత్ సమక్షంలో కుదిరిన ఎంవోయూ




**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**

హైదరాబాద్‌లో గూగుల్ ఎఐ సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు సిఎం రేవంత్ సమక్షంలో ప్రభుత్వంతో గూగుల్ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకుంది. టి హబ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సిఎం రేవంత్, ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాఉబ, సెక్రటరీ జయేశ్ రంజన్, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు. కృత్రిమ మేధతో పాటు అంకుర పరిశ్రమలకు గూగుల్ తోడ్పాటును అందించనుంది. వ్యవసాయం, విద్య,రవాణారంగం, డిజిటల్ రంగంలో గూగుల్ సహకారం అందిస్తుందని ఆ సంస్థ ప్రతినధులు ప్రకటించారు.

# తమిళనాడుకు చేరుకున్న పవన్ కళ్యాణ్

-స్వామిమలై క్షేత్రంలో స్వామినాథన్ దర్శనం



**తంజావూరు ప్రజా స్వేచ్ఛ**

దక్షిణ భారతదేశంలోని పుణ్యక్షేత్రాల పర్యటనలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్.. తన పుణ్య క్షేత్ర యాత్రలో భాగంగా తమిళనాడు రాష్ట్రంలోని తంజావూరు చేరుకున్నారు. కుంభకోణం సమీపంలోని స్వామిమలై క్షేత్రానికి వెళ్లిన ఆయన.. శ్రీ స్వామినాథ స్వామిని దర్శించుకున్నారు.. స్వామిమలై శ్రీ స్వామినాథ స్వామి వారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. షష్ట షణ్ముఖ క్షేత్ర యాత్రకు శ్రీకారం చుట్టారు. కంద షష్టి కవచ పారాయణంలో పాల్గొన్నారు.. ఆది ప్రణవనాదం ఓంకార మంత్ర రహస్యాన్ని సృష్టికి అందించిన క్షేత్రం.. షష్ట షణ్ముఖ క్షేత్రాల్లో ఐదవ క్షేత్రం స్వామిమలై.. ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా గురువారం తంజావూరు సమీపంలోని స్వామిమలైని సందర్శించారు పవన్.. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ అర్చకులు కన్నన్ గురుకల్.. సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.. పంచ హారతులిచ్చారు.. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ధ్వజస్థంభానికి మొక్కారు పవన్ కల్యాణ్.. ఇక, స్వామినాథ స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన కంద షష్టి కవచ పారాయణంలో పాల్గొన్నారు పవన్.. ఆయన కుమారుడు అకీరా నందన్, తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ ఆనంద్ సాయి ఈ క్షేత్రాన్ని దర్శించుకున్నారు.. స్వామినాథ స్వామి దర్శనానంతరం ఆలయంలో వెలసిన ఆదిదంపతులు సుందరేశ్వరన్ స్వామి, మీనాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు..

# బిసి రిజర్వేషన్లపై చేతులు దులుపుకుంటే కుదరదు

-అసెంబ్లీలో అందుకు అనుగుణంగా బిల్లులు పెట్టాలి
-బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్



**జనగామ, ప్రజా స్వేచ్ఛ**

మోసాలు చేయడంలో ఆరితేరిన గుణం కాంగ్రెస్ పార్టీదని, మాటలు చెప్పి మోసం చేయడం ఆ పార్టీకి అలవాటేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. అదో దాఖాబాజ్ పార్టీ అని అన్నారు. జనగామ జిల్లా పర్యటనలో బీసీ బిల్లుపై కవిత స్పందించారు. బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంటే కుదరదన్నారు. అసెంబ్లీలో ఒక్క బిల్లు కాకుండా.. మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యలో 46 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు తేవాలని.. ఉద్యోగాల్లో 46 శాతం రిజర్వేషన్లకు మరొక బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. 42 శాతం స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. ఈ మేరకు బీసీలకు రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు తేవాలన్నారు. బిల్లు పెట్టిన వెంటనే నోటిఫికేషన్ జారీ చేస్తేను ఎన్నికల్లో రిజర్వేషన్లు సాధ్యమవుతాయన్నారు. కానీ, జాప్యం చేసి ఇతరులు కోర్టుకు వెళ్లే అవకాశం ఇచ్చి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం చూస్తున్నట్లుగా నిర్దిష్టమైన సమాచారం ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన ఉద్యమాలకు దిగొచ్చిన ప్రభుత్వం బీసీ బిల్లు పెడుతామని ప్రకటించిందని.. ఇదే బీసీలందరి తొలి విజయమన్నారు. మళ్లీ కుల సర్వేకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని.. 15 రోజుల కాకుండా నెల రోజుల పాటు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో 60శాతం మంది తమ ఇళ్లకు సర్వే చేసే వారు రాలేదని అంటున్నారని.. రీ సర్వేపై ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వాని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్లను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

# వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

-నిరసనల మధ్యే ప్రవేశ పెట్టిన ప్రభుత్వం
-గందరగోళం మధ్య సభ వాయిదా




**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

'వక్ఫ్ సవరణ బిల్లు-2024'పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. జేపీసీకి చైర్మన్‌గా వ్యవహరించిన జగదంబికా పాల్, బిజెపి ఎంపీ సంజరు తదితరులు ఈ ముసాయిదా బిల్లుపై తమ నివేదికను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సభ ముందుకు తీసుకొచ్చారు. ఈ బిల్లుపై నివేదికను రాజ్యసభ ఎంపీ మేధా కులకర్ణి సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. నివేదికపై ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. తాము సమర్పించిన డిస్సెంట్ (అసమ్మతి) నోట్‌ను తొలగించారంటూ నిరసనకు దిగారు. సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభను చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ 20 నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ ప్రతిపక్షాలు తమ నిరసనను కొనసాగించాయి. ఈ నిరసనల మధ్యే ఈ నివేదికకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కాగా, జనవరి 29న ముసాయిదా నివేదికను జెపిసి ఆమోదించిన విషయం తెలిసిందే. బీజేపీ సభ్యులు సూచించిన 14 సవరణలను కమిటీ ఆమోదించింది. అయితే కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆప్, శివసేన(యూబీటీ), ఏఐఎంఐఎంతోసహా ప్రతిపక్ష సభ్యులు సూచించిన ప్రతి మార్పును కమిటీ తిరస్కరించింది. ఈ సవరణలతో వక్ఫ్‌బోర్డులలో ముస్లిమేతరులు కూడా సభ్యులుగా ఉంటారు. ఈ బిల్లుపై ముస్లింలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టి త్వరితగతిన ఆమోదింపజేసుకుంది.

# మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట

ముందస్తు బెయిల్ మంజూరు

**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**



సినీ నటుడు మోహన్‌బాబుకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. జర్నలిస్టు పై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన సుప్రీంకోర్టులో ఫిటీషన్ వేశారు. దీనిపై గురువారం విచారణ జరిపిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసును జస్టిస్ సుదాంశ్ దులియా ధర్మాసనం విచారణ జరిపింది. గత విచారణ సందర్భంగా మోహన్‌బాబుపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు తెలంగాణ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా జర్నలిస్ట్‌పై జరిగిన దాడికి తాను బహిరంగంగా క్షమాపణ చెప్పానని.. నష్ట పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని మోహన్ బాబు ధర్మాసనానికి చెప్పారు. కాగా జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సినీ నటుడు మోహన్‌బాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. మోహన్‌బాబు ఆయన కుమారుడు మంచు మనోజ్ మధ్య ఘర్షణల నేపథ్యంలో జల్‌పల్లిలో ఉన్న మోహన్‌బాబు ఇంటికి వార్తల కవరేజీ కోసం వెళ్లిన తనపై మోహన్‌బాబు దాడి చేశారని పేర్కొంటూ జర్నలిస్టు రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పహడీ షరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు కొట్టివేసింది. గత ఏడాది డిసెంబరు 10న మోహన్ బాబు తనయుడు మంచుమనోజ్ విజ్ఞప్తి మేరకు ఆయన వెంట మీడియా మోహన్‌బాబు ఇంటికి రాగా ఆయన ఒక విలేకరి దగ్గరున్న మైక్‌ను లాక్కొని తల మీద కొట్టారు. తీవ్ర గాయాల పాలైన విలేకరిని ఆస్పత్రిలో చేర్చారు.

# ఫాస్టాగ్‌లో కొత్త నిబంధనలు అమలు




**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**

టోల్ రహదారులపై టోల్ వసూలు కోసం ఉద్దేశించిన ఫాస్టాగ్ లావాదేవీలకు సంబంధించి నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ముఖ్యంగా బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఫాస్టాగ్ వినియోగదారులకు కొత్తగా '70 నిమిషాల' వ్యవధిని నిర్దేశించింది. నిర్దేశిత సమయంలో బ్లాక్‌లిస్ట్‌లోంచి వైదొలగడంలో విఫలమైతే డబుల్ ఫీజు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు ఫిబ్రవరి 17 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు జనవరి 28నే ఓ సర్క్యులర్ జారీ చేసింది. ఫాస్టాగ్‌లో తగిన బ్యాలెన్స్ లేకపోతే ఆ ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్‌లోకి వెళుతుంది. టోల్‌ప్లాజా రీడర్ వద్దకు చేరుకునే సమయానికి 60 నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాస్టాగ్ ఇన్‌యాక్టివ్‌లో ఉంటే కోడ్ 176 ఎర్రర్‌ను చూపి లావాదేవీని తిరస్కరిస్తారు. అలాగే, స్కాన్ చేసిన 10 నిమిషాల తర్వాత ఇన్‌యాక్టివ్‌లోకి వెళ్లినా ఇదే కారణంతో లావాదేవీని తిరస్కరిస్తారు. ఇలాంటి సందర్భంలో పెనాల్టీ కింద రెట్టింపు టోల్ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క బ్యాలెన్స్ మాత్రమే కాదు.. కేవైసీ వెరిఫికేషన్ పూర్తి చేయకపోవడం, ఛాసిస్ నంబర్‌కు, వెహికల్ నంబర్‌కు మధ్య పొంతన లేకపోవడం వంటి కారణాలతో ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్‌లోకి వెళుతుంది. ఈ నిబంధన గురించి వాహనదారులు తెలుసుకోవడం ముఖ్యం. ఫాస్టాగ్‌ను చివరి నిమిషంలో రీఛార్జి చేసే అలవాటు ఉన్న వారు దీన్ని దృష్టిలో పెట్టుకుని ముందుగానే రీఛార్జి చేసుకోవడం మంచిది.

www.prajaswecha.com
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

# పదో తరగతి పరీక్షల్లో కీలకమార్పు

(మొదటి తరువాయి)

కొత్తగా చేర్చనున్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షల్లోనే నమూనా ఓఎంఆర్ పత్రాలను అందించాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రీ ఫైనల్ పరీక్షలు మార్చి 6 నుంచి మార్చి 15వ తేదీ వరకు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షల్లో టెన్త్ విద్యార్థులందరికీ ఓఎంఆర్ పత్రాలను అందించనున్నారు. విద్యార్థులకు అందించే ఈ ఓఎమ్ఆర్ పత్రాల్లో ప్రతి విద్యార్థి తనకు ఇచ్చిన ఆన్సర్ బుక్‌లెట్ సంఖ్యను రాయాల్సి ఉంటుంది. అలాగే దానిపై సంతకం కూడా చేయాలి. విద్యార్థికి సంబంధించిన ఇతర వివరాలు కూడా అందులో ముందుగానే ముద్రించి ఉంటాయి. వాటిని విద్యార్థులు సరిచూసుకోవాలి. వివరాల్లో తప్పులున్నా.. ఆ ఓఎంఆర్ తనది కాకపోయినా.. విద్యార్థులు వెంటనే ఇన్విజిలేటర్‌కు చెప్పాల్సి ఉంటుంది. అలాగే వారిచ్చే ఇతర నామినల్ రోల్ పత్రంలో సరైన వివరాలను రాయాల్సి ఉంటుంది. ఇక ఈ పరీక్షలు ముగిసిన తర్వాత మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల్లో ప్రతిరోజూ ఓఎంఆర్ పత్రాలను విద్యార్థులకు అందిస్తారు. నేరుగా పబ్లిక్ పరీక్షల్లో ఓఎంఆర్ పత్రాలను ఇవ్వడం వల్ల విద్యార్థులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉంది. అందువల్ల కొందరు విద్యార్థులు తప్పులు చేసే అవకాశం ఉంది. మరికొందరికి సమయం వృథా అయ్యే ఛాన్స్ ఉంది. దీన్ని నివారించేందుకు ప్రీ ఫైనల్ పరీక్షల్లో నమూనా ఓఎంఆర్ పత్రాలను ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. దీనివల్ల విద్యార్థులకు కొంత సాధన అవుతుందని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. అలాగే గత ఏడాది వరకు 4 పేజీల మెయిన్ బుక్‌లెట్ తొలుత జారీ చేసి.. అది సరిపోకపోతే అదనపు షీట్లను ఇచ్చేవారు. దీంతో అదనపు షీట్ల సంఖ్యను కూడా ఓఎంఆర్ పత్రంపై రాసేవారు. అయితే ఈసారి మాత్రం ఇంటర్మీడియట్ తరహాలో 24 పేజీల బుక్‌లెట్‌ను పదో తరగతి విద్యార్థులకు కూడా ఇస్తున్నారు. దీనివల్ల బుక్‌లెట్‌పై అదనపు పత్రాల సంఖ్య రాయవల్సిన అవసరం ఉండదు. ఇలాంటి మార్పులన్నింటి దృష్ట్యా ప్రీ ఫైనల్ పరీక్షల్లో నమూనా ఓఎంఆర్ పత్రాలను అందించాలని విద్యాశాఖ భావిస్తుంది.

# అమెరికా చేరుకున్న ప్రధాని మోడీ

(మొదటి తరువాయి)



రెండు రోజుల పర్యటన కోసం గురువారం అమెరికాకు చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానం మేరకు ఆయన అమెరికా పర్యటన చేపట్టారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి, భారతదేశం-యుఎస్ఎ సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్మించడానికి ఎదురుచూస్తున్నాను. మన దేశాలు, మన ప్రజల ప్రయోజనం కోసం మెరుగైన భవిష్యత్తు కోసం కలిసి పనిచేస్తూనే ఉంటాయి' అని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం తెల్లవారు జామున అమెరికాకు చేరుకున్నారు. ఫ్రాన్స్‌లో తన రెండు రోజుల పర్యటనను ముగించిన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి. వారు ప్రతినిధి స్థాయి ఫార్మాట్లలో ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహిస్తారు. గురువారం వాషింగ్టన్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో జరిగే సమావేశానికి ముందు మోడీ అదనపు సుంకాల కోతలకు సిద్ధమవుతున్నారు. ఇది భారతదేశానికి అమెరికన్ ఎగుమతులను పెంచవచ్చు. అధ్యక్షుడు ట్రంప్, డోజ్ అధిపతి ఎలాన్ మస్క్‌తో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా మోదీకి భారత సంతతి వారు ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రత్యేకమైన అతిథి గృహంలో బస చేస్తున్నారు. 1651 పెన్సిల్వేనియా అవెన్యూలోని బ్లెయిర్ హౌస్ ఆయనకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ భవనం శ్వేత సౌధానికి ఎదురుగా ఉండటం దీని విశేషం. అమెరికాలో పర్యటించే అత్యంత ప్రత్యేకమైన అతిథులకు ఇక్కడ బస ఏర్పాటు చేస్తారు. గతంలో చాలా మంది దేశాధ్యక్షులు, రాజకుటుంబ సభ్యులకు దీనిని విడిదిగా వాడారు. దౌత్యపరంగా ప్రాధాన్యమున్న భవనంగా దీనిని భావిస్తారు. ఇది కేవలం విలాసవంతమైన గెస్ట్‌హౌస్ మాత్రమే కాదు. అమెరికా ఆతిథ్యానికి చిహ్నంగా నిలిచింది. దాదాపు 70 వేల చదరపుటడుగుల్లో నాలుగు భవనాలు అనుసంధానమై ఉండటం దీని ప్రత్యేకత. ఇక్కడ మొత్తం 119 గదులు ఉన్నాయి. వీటిలో 14 బెడ్రూమ్‌లు, 35 బాత్ రూమ్‌లు, మూడు డైనింగ్ గదులున్నాయి. అత్యాధునిక బ్యూటీ సెలూన్ కూడా దీనిలో ఉంది. ఇక్కడి వచ్చిన అతిథులకు ఫైవ్‌స్టార్ ఆతిథ్యం ఇస్తారు. అమెరికా చరిత్రను తెలిపే పురాతన వస్తువులు, ఆర్ట్స్‌తో దీనిని అలంకరించారు. 1824లో ఈ భవనాలను నిర్మించారు. ప్రెస్టోన్ ఫ్రాన్సిస్ బ్లెయిర్ 1837లో కొనుగోలు చేశారు. ఆయన పేరును దీనికి పెట్టారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత శ్వేతసౌధానికి అతిథుల తాకిడి గణనీయంగా పెరిగింది. చాలా దేశాధినేతలు, సైన్యాధినేతలు అక్కడే బస చేసేవారు. ఆ తర్వాత 1942లో అమెరికా ప్రభుత్వం ఈ హౌస్‌ను అద్దెకు తీసుకొంది. ఆ ఏడాది చివరి నాటికి 1.56లక్షల డాలర్లకు కొనుగోలు చేసింది. అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆ దేశ డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బర్డ్‌తో భేటీ అయ్యారు. వీరిద్దరూ పలు అంశాలపై చర్చించారు. డీఎన్ఐగా ఆమె నేడు పదవీ బాధ్యతలు చేపట్టడం విశేషం.

# బీసీ జాబితాలో ముస్లింలను చేరిస్తే ఊరుకోం

(మొదటి తరువాయి)

చేశారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం కాంగ్రెస్ కు లేదని దుయ్యబట్టారు. ఎన్నికలు నిర్వహించకపోతే ఆర్థిక సంఘం నిధులు రావని, నిధులు రావని తెలిసినా స్థానిక సంస్థల ఎన్నికలను ఎందుకు జాప్యం చేస్తున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. బండి సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ? 'బీసీ జాబితాలో ముస్లింలను చేరిస్తే ఆమోదించే ప్రసక్తే లేదు. మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం. ఈ విషయం తెలిసి కూడా కేంద్రంపై నెట్టాలనుకోవడం మూర్ఖత్వం. బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని తేటతెల్లమైంది. బీసీల్లో ముస్లింలను చేర్చడంవల్ల బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లు దక్కకుండా పోతాయి. కాంగ్రెస్ పార్టీ బీసీలకు మరింత అన్యాయం చేస్తోంది. ముస్లింలను బీసీల్లో కలిపితే హిందూ సమాజమంతా తిరగబడటం ఖాయం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పడం తథ్యం. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే బీసీ జాబితాలో నుండి ముస్లింలను తొలగించాల్సిందే. ఎన్నికల హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందే' అని అన్నారు. 'ఇచ్చిన మాట తప్పుతూ బీసీలను నిండా ముంచుతున్న పార్టీ కాంగ్రెస్. బీసీలంతా కాంగ్రెస్ మోసాలను గుర్తించాలని కోరుతున్నా. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే దమ్ము కాంగ్రెస్‌కు లేదు. మార్చిలోపు స్థానిక ఎన్నికలు నిర్వహించకపోతే తెలంగాణకు నష్టమని తెలీదా?. 15వ గ్రాంట్స్ కమిషన్ నిధులు ఆగిపోతాయని తెలిసి కూడా జాప్యం చేస్తారా?. ఇప్పటికే రెండు దఫాలుగా నిధులు రాలేదు. 73, 74వ రాజ్యాంగ సవరణలను ఉల్లంఘిస్తున్నారు. స్థానిక సంస్థలకు ఐదేళ్లకోసారి తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగం చెబుతోంది. మీరు ఆమోదించిన రాజ్యాంగాన్ని మీరే అవమానిస్తారా. రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరగడం కాదు.. రాజ్యాంగాన్ని అమలయ్యేలా చూడాలి. సర్పంచ్ లేకుంటే గ్రామ సభలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు జరిగేదెలా?. గ్రామాల్లో పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నా పట్టించుకోరా?. ఓడిపోతామనే భయానికే స్థానిక ఎన్నికలు నిర్వహించడం లేదని బండి సంజయ్ పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ పాలనలో యువతను మత్తులో ముంచారు

(మొదటి తరువాయి)



కేటీఆర్, సంతోష్ కుమార్ లకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి భాగస్వాములుగా ఉన్నారని చెప్పారు. బీఆర్ ఎస్ హయాంలో సన్ బర్న్ పార్టీలో పేరుతో హైదరాబాద్ లో పాశ్చాత్య సంస్కృతిని తీసుకొచ్చిన చరిత్ర బీఆర్ ఎస్ నేతలదని విమర్శించారు. జన్వాడ ఫాం హౌ జ్ కేసులో డ్రగ్స్ ఇచ్చిన కేసులో పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి లిందని అనుమానాలు వ్యక్తం చేశారు. అన్నారు. ఫాంహౌజ్ లలో క్యాసినో, పేకాట, కోళ్ల పందేలు ఆడి స్తూ తెలంగాణ సమాజాన్ని జూదం వైపు మళ్లిస్తున్నారని అన్నారు. కేటార్ అండతోనే ఇలాంటి పనులు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ లో జరిగే అన్ని రకాల జూదాలకు కేటిఆరే నాయకుడు. బీఆర్ ఎష్ నేతలు ఏదో అవినీతిలో భాగస్వాములే అన్నారు. అందరిపైనా విచారణ జరిపి తెలంగాణ యువతను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

# సాంకేతిక రంగంలో సత్తాచాటాలి

(మొదటి తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మరో కొత్త మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించుకోవడం మనందరికీ గర్వకారణంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ జర్నీలో ఇదొక మైలురాయి అని చెప్పారు. మైక్రోసాఫ్ట్, హైదరాబాద్ మధ్య సుదీర్ఘ భాగస్వామ్యం ఉందని అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ విస్తరణలో భాగంగా నూతన భవనాన్ని గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్‌తో తమ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ప్రకటించారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఇటీవలే 25 ఏళ్లు పూర్తి చేసుకుందని గుర్తుచేశారు. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ నుంచి గ్లోబల్ ఇన్నోవేషన్, ఇంపాక్ట్ క్రియేట్ చేసిందని తెలిపారు. ఇది యువతకు మరింత సాధికారత కల్పిస్తుందని చెప్పడానికి తాను సంతోషిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తు ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దేనని ఉద్ఘాటించారు. ఈ భాగస్వామ్యంతో తెలంగాణ, మైక్రోసాఫ్ట్ 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టడంతో పాటు గవర్నెన్స్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించనుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ పెట్టుబడి తమ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడంతోపాటు మెంటార్షిప్, ఏఐ టూల్స్, గ్లోబల్ నెట్‌వర్క్ యాక్సెస్‌ను చేస్తుందని అన్నారు. తమ ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్ ఏఐ సెంటర్ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కేంద్రం ఏఐ నాలెడ్జ్ హబ్ సహా క్లౌడ్ ఆధారిత ఏఐ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుందన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచిన మైక్రోసాఫ్ట్ లీడర్ షిప్ టీమ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆవిష్కరణల పట్ల మీ నిబద్ధత మా తెలంగాణ రైజింగ్ విజన్‌కు తోడవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# 19న బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

(మొదటి తరువాయి)

నిర్వహణ అధ్యక్షుడు కేటీఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ భేటీలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం, నిర్మాణాత్మక అంశాలపై చర్చించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాలలపై చర్చించడంతో పాటు వాటిని ఎండగట్టేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి.. ప్రజలను చైతన్యం చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. కేసీఆర్ అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ, ఎంపీలు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పోరేషన్ ఛైర్మన్లు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు.. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు హాజరవుతారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలమీద ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణపై సమగ్ర చర్చ జరగనుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకుంటూ, తమ హక్కులను తాము కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం అనుసరించాల్సిన వ్యూహాలు విధానాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. సమగ్ర చర్చ జరిపి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే కీలక సమావేశం కాబట్టి ఆహ్వానితులందరూ రావాలని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

(మొదటి తరువాయి)

రాష్ట్రపతి పాలన దిశగా కేంద్రం నిర్ణయం తీసుకుంది. మైతేయి, కుకీ తెగల మధ్య జరుగుతున్న ఘర్షణల కారణంగా మణిపూర్ అట్టుడు కుతోంది. ఈ క్రమంలో సీఎం రాజీనామా చేశారు. మణిపూర్ అల్లర్ల సందర్భంగా సీఎం బీరేన్ సింగ్ ఒక వర్గానికి కొమ్ము కాస్తున్నారని, ఒక వర్గాన్ని కావాలనే రెచ్చగొట్టి అల్లర్లకు మద్ధతు ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో సొంత పార్టీ నేతలే ఆయనపై విమర్శలకు దిగారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తే విశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉండటం.. సొంత పార్టీ నేతలు విప్ ధిక్కరించి వ్యతిరేకంగా ఓటు వేసే పరిస్థితులు ఉన్నందున.. పార్టీ అధిష్టానం సీఎం బీరేన్ సింగ్ తో రాజీనామా చేయించింది. మణిపూర్ లో మే 2023 నుంచి అల్లర్లు జరుగుతున్నాయి. వందల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. వేల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. అల్లర్లను నివారించడంలో విఫలమయ్యారనే విమర్శల నడుమ.. ఆదివారం (ఫిబ్రవరి 9 సీఎం రాజీనామా చేశారు. దీంతో తాజాగా రాష్ట్రపతి పాలన విధిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. మే 2023 నుంచి మణిపూర్?లో తీవ్రమైన హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. నవంబర్ 7న జిరిబామ్‌లోని జైరాన్ గ్రామంలో హ్మార్ తెగకు చెందిన ఒక మహిళ, ముగ్గురు పిల్లలను మైతేయి మిలిటెంట్లు హత్య చేయడంతో మణిపూర్?లో మరోసారి అల్లర్లు తీవ్రరూపం దాల్చాయి. దీనికి ప్రతీకారంగా నవంబర్ 11న మైతేయి వర్గంపై కుకీ తీవ్రవాదులు ఎటాక్ చేశారు. అప్పట్నుంచి మణిపూర్ రావణకాష్టంలా మండుతూనే ఉంది. ప్రభుత్వం అల్లర్లను అదుపు చేయడంలో విఫలమైందని సొంత పార్టీ నేతలే తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో సీఎం బీరేన్ సింగ్ రాజీనామా చేయగా.. ఆ తర్వాత రాష్ట్రపతి పాలన విధిస్తూ తాజాగా కేంద్రం నిర్ణయం తీసుకుంది.

# పార్లమెంట్ ముందుకు కొత్త ఐటీ చట్టం

(మొదటి తరువాయి)

ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో ప్రకటించిన మేరకు బిల్లును తీసుకుని వచ్చారు. అయితే విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. బిల్లుకు నిరసనగా వాకౌట్ చేయడం గమనార్హం. అనంతరం కాసేపటికే లోక్‌సభ మార్చి 10కి వాయిదా పడింది. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు ఇప్పుడు బిల్లును రూపొందించారు. ఈ చట్టాన్ని సమీక్షించడానికి కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేసింది. చట్ట సమీక్షకు 22 ప్రత్యేక సబ్ కమిటీలనూ ఏర్పాటు చేశారు. మొత్తం మీద కొత్త చట్టం సమీక్ష నిమిత్తం 6500 సలహాలను ఆదాయ పన్ను విభాగం అందుకుంది. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుని, కొత్త బిల్లు తీసుకొచ్చారు. మొన్నటి బడ్జెట్‌లో కూడా ఆదాయపు పన్న విషయంలో సరళీకరణ చేపట్టామని అన్నారు. అందుకు అనుగుణంగా కొట్ట ఐటి చట్టానికి ఇటీవలే కేబినేట్ ఆమోదించింది. దానికి చట్టబద్దత కల్పించేందుకు పార్లమెంటు ముందుకు తీసుకుని వచ్చారు.

# సంపాదకీయం

## ఉచిత పథకాలపై కనువిప్పు కలిగేనా ?

ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరిక, ప్రజలకు ముఖ్యంగా రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలతో ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. లక్షల కోట్లు అప్పులు చేసి, వడ్డీలు కట్టలేక, జీతాలు చెల్లించలేక, కనీసం ఓ రోడ్డు కూడా సక్రమంగా వేయలేక చతికిల పడుతున్నాయి. దీనికితోడు ప్రభుత్వాలు కూడా దుబారా తగ్గించుకోవాలి. ఈ విషయంలో జాతీయస్థాయి చర్చ సాగాలి. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తున్నారు. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించింది. ఇది పాటిస్తారా లేదా అన్నది చూడాలి. అయితే ఇలా ఎంతకాలం ఇస్తారన్నది ప్రజలు కూడా ఆలోచన చేయాలి. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ , ఉచితంగా బస్సు ప్రయాణం.. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రకాలుగా ప్రజలు తమను తాము రాజకీయ నాయకులకు ఓట్లుగా అమ్ముకోబడుతున్నారు. ఇది ప్రజలకు మంచిది కాదు. రాజకీయ నాయకులు ఉచిత పథకాలను నిలదీయగలగాలి. రాజ్యాంగ పరంగా ఇలాంటి వాటిపైనా ఆంక్షలు ఉండాలి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సుప్రీం తీర్పు నేపథ్యంలో ఉచిత పథకాల పందేరాన్ని ఆపాలి. సంక్షేమం పేరుతో ప్రజలను చేష్టలుడిగేలా చేయడం సరికాదు. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవాలి. ప్రజలకు స్వీట్ల మాదిరి ఉచితాలను పంచిపెడుతూ పోతే ఆధునిక భారత దేశం అంధకార యుగంలోకి జారిపోతుందని గతంలో ఓమారు ప్రధాని మోడీ సెలవిచ్చారు. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్‌ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేం అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2022 జూలై 16న యూపీలో బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభిస్తూ హెచ్చరించారు. ఆనాడు దీనిని అనేకులు విమర్శించారు. మోడీకి సంక్షేమం పట్ల శ్రద్ధ లేదన్నారు. అయితే మోడీ ఇలా చెప్పినప్పుడు పాటించివుంటే బాగుండేది. కానీ ఆ తర్వాత ఏడాదే మధ్యప్రదేశ్‌లో లాడ్లీ బెహనా పథకం క్రింద మహిళలకు నెలకు రూ.1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ. 3వేల వరకు పెంచుతామని బీజేపీ ప్రకటించింది. మొన్న మహారాష్ట్రలో కూడా ఇదేవిధంగా ఇలాంటి పథకాన్నే ప్రకటించారు. మధ్యప్రదేశ్‌లోనే కాదు, ఆ తర్వాత ప్రతి రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఉచితాల మీద ఉచితాలను ప్రకటిస్తూ ఎన్నికల్లో ప్రయోజనం పొందింది. దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కనీవినీ ఎరుగని స్థాయిలో ఉచితాల హామీలను ప్రకటించింది. దీన్నిబట్టి చూస్తే మోడీయేనా ఉచితాలను వ్యతిరేకించింది అని ఆశ్చర్యం కలుగక మానదు. ఉచిత పథకాలు వద్దనుకున్నప్పుడు అందుకు కార్యాచరణ చేయాలి. ప్రజలను ఉచిత ఊబిలో పడకుండా చేయాలి. అభివృద్ధితో వారిని ముందుకు తీసుకుని వెళ్లాలి. ఉచిత పథకాల సంస్కృతి కారణంగా దేశ, రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖజానాపై విపరీతంగా భారం పడుతుందని ఆర్థికవేత్తలు హెచ్చిరిస్తున్నారు. ఇది తెలిసినా ఏ రాజకీయ పార్టీ కూడా ఉచితాలను ప్రకటించేందుకు వెనుకాడడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 43 ఏళ్ల క్రితం ప్రారంభం అయిన కిలో రెండు రూపాయాల బియ్యం పథకాన్ని ఇప్పుడు కిలో రూపాయికే ఇవ్వడం వెనక సామాజిక ఉద్దరణ, పేదరిక నిర్మూలనకన్నా ఓట్ల బేరమే దాగివుంది. కిలో బియ్యం పథకం పెద్ద మాఫియాగా మారినా విజినరీ చంద్రబాబు చర్యలు తీసుకోవడం లేదు. ఉచితాలను సమర్థంగా అమలు చేస్తే అధికారంలోకి తప్పకుండా రాగలం అన్న నమ్మకంతో ఆమ్ ఆద్మీ పార్టీ రాజకీయ మొదలు పెట్టింది. మంచినీరు, విద్యుత్, ఆరోగ్యం, విద్య, మహిళలకు బస్సు ప్రయాణం, వృద్ధులకు తీర్థ యాత్ర.. ఇలా ప్రతి రంగంలోనూ ఉచితాలను ప్రవేశపెట్టి అమలు చేయడం ద్వారా 2013 నుంచి ఇప్పటి వరకూ ఆప్‌కు ఎన్నికల్లో తిరుగులేకుండా పోయింది. అంతకు మించి బిజెపి హామీలు ఇవ్వడంతో ఇప్పుడు ఢిల్లీలో కొట్టుకు పోయింది. ఎపిలో జగన్ సర్కార్ అన్నీ ఉచితాలే ప్రకటించింది. ప్రతిరోజూ ఏదో రూపంలో బటన్ నొక్కడమే పనిగా పెట్టుకున్నారు. అయినా ప్రజా తీర్పులో కొట్టుకు పోయారు. అయనేమీ నష్టపోలేదు. ఎపిని 7 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. తెలంగాణలో కెసిఆర్ కూడా దాదాపు ఇలాగే పథకాలు ప్రకటించి తనకు తిరుగులేదని నిరూపించుకున్నారు. ఆయనా కొట్టుకుపోయారు. ఇప్పుడు కాంగ్రెస్ కూడా ఉచిత బస్సు మొదలు అనేక పథకాలను కొనసాగి స్తోంది. ఆదాయం వడ్డీలకే సరిపోవడం లేదని రేవంత్ ప్రభుత్వం వాపోతోంది. అయినా సమీక్షించుకునే ధైర్యం చేయడం లేదు. నగదు బదిలీల వల్ల ప్రజల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత తోడ్పడుతుందనే వాదన ఒకటి ఉన్నది. అయిత నిరుత్పాదక వ్యయం వల్ల జరిగే నష్టాలు అన్నీ ఇన్నీ కావు. ప్రజలకు చేతినిండా పని కల్పించలేని ప్రభుత్వాల అసమర్థత వల్ల ఆర్థిక వ్యవస్థకు ఎంత మేరకు నష్టం జరుగుతుందో, దాని వల్ల సమాజంలో జరిగే నష్టాలు ఎన్నో కూడా ఊహించవచ్చు. కొందరికి లభించే ఉచితాల కోసం జివిఎస్టీ లాంటి పన్నుల రూపంలో మరికొందరు చెల్లించాల్సి వస్తుంది. వేలకోట్లు బ్యాంకులకు అప్పులు బాకీపడిన, విదేశాలకు పరారైన, కోట్ల రూపాయలు పన్నులు ఎగ్గొట్టిన, రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చిన సంపన్నులు మాత్రం ఈ ఉచితాలను భరించడం లేదన్నది మాత్రం వాస్తవం. ఉచిత పథకాలతో ప్రజల్లో కష్టపడే తత్వం పోతోందని, వారు పనులకు దూరంగా ఉంటున్నారని, రాజకీయ పార్టీల ఉచిత పథకాలను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు ఉచితాలను ప్రకటించే పద్ధతి మంచి కాదని వ్యాఖ్యానించింది. ఉచిత పథకాలు మంచివి కావు. దురదృష్ట వశాత్తూ.. వీటి కారణంగా ప్రజలు కష్టపడి పని చేసేందుకు ఇష్టపడడం లేదు. ఉచితంగా రేషన్, డబ్బులు అందుతున్నాయి. ఎలాంటి పని చేయకుండానే డబ్బులు వస్తుండటంతోనే ఇలా జరుగుతోంది. ప్రజలకు సౌకర్యాలు అందించాలన్న ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే. కానీ, వారిని దేశ అభివృద్ధిలో భాగం చేయాలే తప్ప సోమరులను కాదన్న రీతిలో వ్యాఖ్యానించింది. ఎన్నికల్లో ఉచిత పథకాలు ప్రకటించే పద్ధతి సరైనది కాదని జస్టిస్ బీఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా అయినా ప్రధాని మోడీ ఉచిత పథకాలకు అడ్డుకట్ట వేసేలా ముందుకు రావాలి. ఎక్కడో ఒకచోట్ దీనికి ముగింపు పలికితే మంచిది.

# ఆప్ ఓటమి ప్రజాస్వామ్య విజయమేనా?

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ ఓడిపోయింది. మధ్యతరగతి ఓటర్లు మందహాసం చేస్తున్నారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రత్యర్థులు ఆనంద తాండవం చేస్తున్నారు. క్షమించాలి, నేనీ విజయోత్సవాలలో పాల్గొనలేను. ఇది నిజంగా 'ఆమ్ ఆద్మీ' విజయమేనా అని ప్రశ్నిస్తున్నాను. పది సంవత్సరాల క్రితం ఆప్‌లో పనిచేస్తున్న మాలో కొంతమందిపై పుకార్లు పుట్టించి, అవమానించి గెంటివేసిన వైనాన్ని నేను మరచిపోయానని మీరు పొరపడవద్దు. ఒక విశాల రాజకీయ సన్నివేశం గురించి యోచిస్తున్నప్పుడు నా వ్యక్తిగత అనుభవాలు, ఎంత చేదువైనా, ఆ వివేచనను ప్రభావితం చేయడాన్ని అనుమతించను. ఢిల్లీ ఎన్నికలలో బీజేపీ గెలుపు, ఆప్ ఓటమి ఆ విస్తృత రాజకీయ సన్నివేశంలో ఒక భాగం మాత్రమే. ఆ ఆలోచన నా గురించి కాదు, ఆప్, దాని నాయకుల గురించీ కాదు. నేను ముందే ప్రస్తావించినట్టు అది 'ఆమ్ ఆద్మీ' గురించి. చింత, కలత, ఆందోళన మిళితమైన మనసుతో నిట్టూరుస్తున్నాను.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఆప్ పదేళ్ల పాలన ఒక ప్రజాభిప్రాయ సేకరణ. ప్రజలు ఆప్ పాలనను నిర్ద్వం ద్వంగా తిరస్కరించారు. ఢిల్లీ ప్రజల ఆప్ తిరస్కారం బీజేపీకి అధికార లబ్ధిని సమకూర్చింది. గమనించారా? పరాజిత ఆప్, విజేత బీజేపీ మధ్య ఓట్ల శాతం కేవలం 3.5శాతం మాత్రమే. బీజేపీ సాధించుకున్న సీట్ల సంఖ్యను సూచిస్తే విజేత ఓట్ల వాటా పరాజిత ఓట్ల వాటా కంటే చాలా అధికంగా ఉండవచ్చనే భావన కలుగుతుంది. అయితే వాస్తవంగా ఆ రెండు వాటాల మధ్య తేడా ఊహాత్మక అంచనా కంటే చాలా తక్కువగా లేదూ?!ఢిల్లీ ఎన్నికల ఫలితం ఎటువంటి పరిస్థితులలో విరుద్ధంగా ఉండేదో ఊహించడం కష్టమేమీ కాదు. అవినీతి ఆరోపణలు ప్రజల దృష్టికి వెళ్లకుండా ప్రసార మాధ్యమాలు బీజేపీ నాయకులను కాపాడిన విధంగానే ఆప్ నేతలనూ ఆదుకున్నట్టయితే పరిస్థితి మరో విధంగా ఉండేది. ఢిల్లీ ఎన్నికలు కేంద్ర బడ్జెట్‌కు ముందే నిర్వహించేందుకు ఎన్నికల సంఘం శ్రద్ధ చూపి ఉన్నట్టయితే, అలాగే ఢిల్లీ ఓటర్లను లక్ష్యం చేసుకునేందుకు కేంద్ర బడ్జెట్‌ను అనుమతించబోమన్న తన హామీకి ఈసీ కట్టుబడి ఉన్నట్టయితే పరిస్థితి భిన్నంగా ఉండేది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జార?ండ్‌లో వలే మహిళలకు నగదు బదిలీ పథకాన్ని అమలుపరచడంలో ఢిల్లీ ప్రభుత్వాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ నిరోధించకుండా ఉన్నట్టయితే ఓటర్లు అంతగా ఆప్‌కు వ్యతిరేకమయ్యేవారు కాదు




అని నిశ్చితంగా చెప్పవచ్చు. ఆప్, కాంగ్రెస్‌లు పొత్తు పెట్టుకోకపోయినా ఎక్కడ పోటీ చేయాలి, ఎన్ని సీట్లకు పోటీ చేయాలి అనే విషయమై అవగాహన కుదుర్చుకున్నట్లయితే ఈ రెండు పార్టీల పరిస్థితి మరింత మెరుగ్గా ఉండేది. ప్రస్తావించిన వాటిలో ఏ ఒక్కటైనా సంభవించి ఉన్నట్టయితే మరో 2 శాతానికి పైగా ఓట్లు ఆప్‌కు చేకూరేవి. ఎన్నికల ఫలితాలపై పతాక శీర్షికలు భిన్నంగా ఉండేవి. ఇదే సమయంలో ఓటర్లలో 'ప్రభుత్వ వ్యతిరేకత' చాలా తీవ్రంగా ఉందన్నది ఒక కొట్టివేయలేని వాస్తవం. అయితే ఈ వ్యతిరేకతను ఓట్ల వాటాల వైనం పూర్తిగా ప్రతిబింబించలేదు. ప్రజల శ్రేయస్సుకు సంబంధించిన వివిధ అంశాల%–%అభివృద్ధి, రోడ్లు, పారిశుద్ధ్యం, తాగు నీటి సరఫరా%–% లో ఆప్ సర్కార్‌పై ప్రజల్లో భ్రమలు పూర్తిగా తొలగిపోయాయని సిఎస్‌డిఎస్%–%లోక్‌నీతి సర్వే ధ్రువీకరించింది. ఆప్ ప్రభుత్వం పనితీరుపై ప్రజల సంతృప్తి, కేంద్ర ప్రభుత్వ పనితీరు పై కంటే తక్కువగా ఉన్నది. అరవింద్ కేజ్రీవాల్‌కు వ్యక్తిగతంగా ప్రజాదరణ ఆ పార్టీకి లభించిన ఓటర్ల వాటా కంటే తక్కువగా ఉన్నది. అవినీతి నిర్మూలన నినాదంతో ప్రభవించిన ఆప్ ప్రభుత్వం 'పూర్తి'గా లేదా 'కొంతమేరకు' అవినీతి సర్కార్ అని ఢిల్లీ ఓటర్లలో మూడింట రెండు వంతుల మంది అభిప్రాయపడడం దిగ్భ్రాంతికరమైన విషయం. ఆప్‌కు ఓటు వేసిన ఢిల్లీ ఓటర్లలో చాలా మంది ఆ పార్టీని అంతగా ఇష్టపడడం లేదన్నది కూడా నిరాకరించలేని వాస్తవం. ఆప్‌కు ఒక గట్టి ప్రత్యామ్నాయం ఉన్నా, బీజేపీ తరపున విశ్వసనీయమైన ముఖ్యమంత్రి అభ్యర్థి ఉన్నా లేదా కాంగ్రెస్ ఒక గెలుపు గుర్రంగా కనిపించినా ఈ ప్రజాభిప్రాయసేకరణలో ఆప్ పట్ల మరింత వ్యతిరేకత వ్యక్తమై ఉండేది. అవును, ఈ ఎన్నికల పరాజయం ఆప్‌కు పూర్తిగా యుక్తమైనదే. అయితే అందుకు సంతోషించవలసింది ఏమీ లేదు. నిజానికి రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం మన దేశంలో సుస్థిరంగా వర్ధిల్లాలని కోరుకుంటున్న వారు ఆప్ ఓటమిలోని అపశకునాలకు ఆందోళన చెందాలి, మన గణతంత్ర రాజ్య భవిష్యత్తు గురించి శ్రద్ధతో ఆలోచించాలి. ఆప్ ఓటమికి నేను చింతిస్తున్నాను %–% ఆ పార్టీకి నేను అభిమానిని అయినందువల్ల కాదు. రాజకీయాలలో మౌలిక పరివర్తన సాధించేందుకు ప్రభవించిన పార్టీ అది. ఆవిర్భవించిన మొదటి రెండు సంవత్సరాలలోనే ప్రజామోదం సంపూర్ణంగా పొందిన పార్టీ అది. ఆ పార్టీ అధినేత వ్యక్తిపూజను పోత్సహించాడు, సకల అధికారాలనూ తన చేతుల్లో కేంద్రీకరించుకున్నాడని నిక్కచ్చిగా చెప్పక తప్పదు. ఇక ఆయన సన్నిహితులు, ఆంతరంగికులు నిగూఢ రాజకీయాలు చేశారు, రెండు నాల్కలతో మాట్లాడారు, సాధారణ పార్టీ కార్యకర్తను లక్ష్యపెట్టలేదు. ఏతా వాతా ఏ పార్టీల నయితే అధికారం నుంచి, జాతి రాజకీయ జీవితం నుంచి తొలగించేందుకు పుట్టిందో ఆ ప్రధాన స్రవంతి రాజకీయ పక్షాల కంటే ఆప్ భిన్నమైనది కాదని రుజువయింది. మీడియాలో ముఖ్యమంత్రి నివాసం 'శీష్ మహల్' గురించి అతిశయోక్తులతో ఉధృత ప్రచారం జరిగింది. పార్టీ నాయకులు పదే పదే మాట్లాడిన గాంధేయ ఆదర్శాలకు విరుద్ధంగా వారి జీవన శైలి ఉన్నందునే మీడియా నిశిత విమర్శలు అనివార్యమయ్యాయి. మద్యం కుంభకోణంలో ఆప్ నాయకులకు న్యాయస్థానాలు ఎటువంటి శిక్ష విధించని మాట నిజమే. అసలు వారు ఆ అవినీతికి పాల్పడినట్లు న్యాయసమ్మతమైన రుజువులు లభించకపోవచ్చు. అయినా మద్యం కుంభకోణం మిథ్య కాదు. ఆప్‌కూ నైతిక విలువలు లేవనే కఠోర వాస్తవాన్ని ప్రజలకు అది స్పష్టం చేసింది. ఆప్ ఓటమికి నేను కలత చెందుతున్నాను. 'ఢిల్లీ నమూనా' ఆదర్శప్రాయమైనదని విశ్వసించడం వల్ల కానే కాదు. ఆప్ సర్కార్ ప్రభుత్వ విద్యారంగానికి రాజకీయ ప్రఖ్యాతి తీసుకువచ్చింది.

# ఉక్రెయిన్ పోరు ముగిసేనా?

అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ బుధవారం నాడు రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్‌తో గంటన్నరపాటు ఫోన్లో చర్చలు జరిపారు. ఉక్రెయిన్ పోరును ముగించేందుకు సంప్రదింపులు ప్రారంభించాలని ఇద్దరూ అంగీకరించారు. నేతలిద్దరూ సౌదీ అరేబియాలో భేటీ అయ్యే ముందు ఇరు దేశాల ప్రతినిధి వర్గాలు చర్చలు జరుపుతాయి. ఇవీ బుధ, గురువారాల నాటి వార్తల సారాంశం. మరోవైపున అంతకుముందు రోజు ఉక్రెయిన్ నేత జెలెన్‌స్కీ ఏమన్నాడు! 'ఉక్రెయిన్ లేకుండా ఉక్రెయిన్ గురించి చర్చలు కుదరవు, తమ భూభాగాలను తిరిగిస్తే దానికి బదులుగా మేము ఆక్ర మించుకున్న కురుస్క్ ప్రాంతాన్ని రష్యాకు అప్పగిస్తాం' అన్నాడు. ససేమిరా అది కుదిరేది కాదని రష్యా స్పష్టం చేసింది. ఏ సంప్రదింపుల్లోనైనా ఐరోపా, ఉక్రెయిన్‌కు భాగస్వామ్యం ఉండాల్సిందే, ఉక్రెయిన్ భద్రతకు గట్టి హామీ కావాలంటూ బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీతో సహా ఏడు నాటో కూటమి దేశాలు ఒక సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశాయి. ఇదీ తాజా పరిస్థితి.

'నేను అధికారానికి వచ్చిన ఇరవై నాలుగు గంటల్లోనే ఉక్రెయిన్ పోరును ముగిస్తా' అని ట్రంప్ చెప్పిన సంగతి తెలిసిందే. అయితే అది అంత తేలిక కాదని, ఒక వేళ ముగియాలన్నా కొన్ని నెలలు పడుతుందని అతగాడి యంత్రాంగం చెప్పిన తర్వాతతీరు మారింది. తమ ఆయుధాలు అమ్ముకోవటానికి, లాభాలను కొనసాగించటానికి ఉక్రెయిన్ పోరు కొనసాగాలని అమెరికా ఆయుధ పరిశ్రమ ఒత్తిడి తెస్తున్నది. నిజానికి ఉక్రెయిన్ పోరుతో నిమిత్తం లేకుండానే నాటో కూటమి దేశాలు జీడీపీలో రెండుశాతం మొత్తాలను ఖర్చు చేయాలని ఎప్పటి నుంచో అమెరికా ఒత్తిడి తెస్తున్నది, ఐరోపా రక్షణకు తామెందుకు మూల్యం చెల్లించాలని తొలిసారి అధికారానికి వచ్చినపుడే ట్రంప్ ప్రశ్నించాడు. ఇప్పుడు కనీసం ఐదుశాతం ఉండాలని చెబుతున్నాడు.అమెరికా 3.4శాతం, బ్రిటన్2.3, రష్యాకు దగ్గరగా ఉన్న పోలాండ్, బాల్టిక్ దేశాలు నాలుగు శాతానికి అటూఇటూగా ఖర్చు చేస్తున్నాయి.



ఇదంతా రష్యాను బూచిగా చూపుతున్న ఫలితమే. ప్రతిదాన్నీ డాలర్లలో కొలుచుకునే ట్రంప్‌కు ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరిస్తే అమెరికన్లకు నష్టమే తప్ప లాభముండదు. అందువలన పుతిన్‌తో చర్చలు జరిపినా నిజంగా పరిష్కా రానికి ట్రంప్ ముందుకు వెళతాడా అన్నది సందేహమే. ఇజ్రా యిల్–హమాస్ మధ్య కుదిరిన ఒప్పందానికి విఘాతం కలిగించే విధంగా గాజా ప్రాంతం నుంచి పాలస్తీనియన్లు ఈజిప్టు, జోర్డాన్ వెళ్లి ఆ ప్రాంతాన్ని తమకు అప్పగించాలని ట్రంప్ కోరటం చూస్తున్నదే.ఒక వైపు 2014కు ముందున్న స్థితి గురించి ఉక్రెయిన్ పట్టుబడితే అది వాస్తవికతకు దూరం అని, కొన్ని ప్రాంతాలను వదులుకోక తప్పదనే సందేశాన్ని అమెరికా ఇస్తున్నది. మరోవైపు విలువైన ఖనిజ సంపదలున్న ప్రాంతాలను తమకు అప్పగిస్తే ఉక్రెయిన్‌కు సాయం చేస్తామని కూడా అది బేరం పెట్టింది. దీనికి ఐరోపాలోని ధనిక దేశాలు అంగీకరిస్తాయా? అంటే లేదని వేరే చెప్పనవసరం లేదు. చర్చలు జరపాలన్న ట్రంప్ ప్రతిపాదనను రష్యా వ్యతిరేకించదు. చర్చలు, పరిష్కారం తన అజెండా ప్రకారం జరగాలని అది కోరుకుంటున్నది. నాటోను తమ దిశగా విస్తరించకూడదు, ఉక్రెయిన్‌కు చోటు కల్పించకూడదన్న హామీ కావాలని అది తొలినుంచీ డిమాండ్ చేస్తున్నది. దానికి తిరస్కరించిన కారణంగానే గతంలో తన భాగంగా ఉన్న క్రిమియా ప్రాంతాన్ని 2014లో ఉక్రెయిన్ నుంచి విలీనం చేసుకున్నది. తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో తలెత్తిన వేర్పాటువాదానికి మద్దతు ఇచ్చి ఇప్పటి వరకు దాదాపు ఇరవై శాతం ప్రాంతాన్ని తమ అదుపులోకి తెచ్చుకుంది. దానితో పోలిస్తే జెలెన్‌స్కీ చెబుతున్న కురుస్క ప్రాంతాన్ని అసలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరమే లేదు. దాన్నుంచి అది వెనక్కు తగ్గటం తప్ప తురుపుముక్కగా వాడే పరిస్థితిలో లేదు.ట్రంప్, అతని అధికారగణం ఆలోచన ప్రకారం నాటోలో ఉక్రెయిన్ చేరకూడదు. నిజంగా అదే జరితే జెలెన్‌స్కీ రాజకీయంగా ఆత్మహత్యకు పాల్పడినట్లే. చర్చలు జరిగి ఒప్పందం అంటూ కుదిరితే, అది కేవలం సైనిక చర్య నిలుపుదలకే పరిమితమైతే ఐరోపా దేశాల పరువూ పోవటం ఖాయం. ఈ మాత్రం దానికి మూడేండ్లు ఎందుకు ప్రతిఘటించినట్లు అని జనం కూడా ప్రశ్నిస్తారు. ఇంతకాలం జెలెన్‌స్కీ సేనలు రష్యన్లను ఎదుర్కొంటున్నాయంటే అవి ఇచ్చిన ఆయుధాలు, మద్దతే కారణం. ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కార సమస్యలో అమెరికా–ఐరోపా దేశాల మధ్య మిత్ర వైరుధ్యం ఉన్నట్లు ఏడు దేశాల ప్రకటన సూచిస్తున్నది. పుతిన్‌తో చర్చల తరువాత జెలెన్‌స్కీ కూడా ట్రంప్‌తో మాట్లాడినప్పటికీ వివరంగా చర్చ జరిగినట్టు మాత్రమే చెప్పాడు తప్ప ఉత్సాహం కనపడలేదు. ఉక్రెయిన్ సంక్షోభం పరిష్కారం కావాలని అందరూ కోరుకుంటున్నారు.శాంతి చేకూరాలని కోరుకోవటమే కాదు, దానికి చిత్తశుద్ధితో చేతులు కలపటం కూడా ముఖ్యమే.

# తెలంగాణలో మళ్లీ కుల గణన





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ.....

కీలక నిర్ణయం తీసుకున్న రేవంత్ ప్రభుత్వం... స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ 15వ తేదీ లోపు వెలువడుతుందని అందరూ భావించారు. కానీ, ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మరోసారి కులగణన సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వేలో పాల్గొనని వారికి ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు అవకాశం కల్పించింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని స్పష్టం చేసింది. రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందాకే ఎన్నికలు జరిగే అవకాశముంది. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. స్థానిక ఎన్నికల తేదీలను ప్రకటిస్తారేమోనని అనుకున్నారు. అయితే కులగణన రీసర్వేకు నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సర్వే స్పష్టంగా ఉందని .. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం రాజకీయ ప్రయోజనాలు పక్కకు పెట్టి అభివృద్ధికి మద్దతు పలకాలని పేర్లు నమోదు చేసుకోని వారికి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. కులగణనలో పాల్గొనని 3.1 శాతం మంది కోసం మరోసారి సర్వే చేపడుతున్నామని ఇప్పటికే నమోదు చేసుకున్న వారు అవసరం లేదని భట్టి విక్రమార్క ప్రకటించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు అప్పుడే: భట్టి

స్థానిక సంస్థల ఎన్నికలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్లపై క్లారిటీ వచ్చాకే ఎన్నికలు జరుగుతాయన్నారు. 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై మార్చి మొదటి వారంలో కేబినెట్ తీర్మానం చేయనుంది. శాసనసభలో బిల్లు ఆమోదం చేసి చట్టబద్ధం చేయాలని నిర్ణయించాం. కులగణన బిల్లును కేంద్రానికి పంపుతాం. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్‌లో ఆమోదానికి కృషి చేస్తాం' అని అన్నారు.

## పేర్లు నమోదు చేసుకోని 3.1 శాతం మంది

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కులగణన చేపట్టింది. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కూడా ప్రవేశ పెట్టారు. అయితే చాలా మంది వివరాలు నమోదు చేయలేదని.. ఉద్దేశపూర్వకంగా జనాభాను తగ్గించారని రాజకీయ నేతలు, బీసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. పదేళ్ల కిందట కేసీఆర్ సమగ్ర కుటుంబసర్వేను చేశారు. అప్పటి రికార్డులతో పోలిస్తే ఇప్పుడు జనాభా తగ్గిపోయారని..కుటుంబాలు తగ్గిపోయారని ..ఇది ఫేక్ సర్వే అంటున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం కొంత మంది ఉద్దేశపూర్వకంగానే వివరాలు ఇవ్వలేదని చెబుతోంది.

# బీ జే పీ మోసాలను బీ సీ లు ఇంకా సహించే పరిస్థితిలో లేరు!





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## -33 శాతం మహిళ రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు 50 శాతం కేటాయించాలి !

2023 చివరలో హడావిడిగా పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేయడం జరిగినది. ఆ బిల్లులో బీసీ కులాల వారికి మహిళలకు సబ్ కోటాగా 50 శాతం రిజర్వేషన్ అమలు చేయటానికి ఇప్పుడు 16 తేదీ వరకు జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో మహిళా బిల్లును సవరణ చేసి ఆమోదింప చేయాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ శ్రీమతి పేరం అలేఖ్య న్యాయవాది గారు డిమాండ్ చేశారు. స్వతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేకుండా కాంగ్రెస్ పార్టీ 55 సంవత్సరాలు పరిపాలన చేసింది బిజెపి పార్టీని 40 సంవత్సరాల క్రితం ఏర్పరచినప్పటికీ 17 సంవత్సరాలుగా పరిపాలన చేస్తున్నది వాజ్పేయి గారు ఆరు సంవత్సరాలు నరేంద్ర మోడీ గారు 11 సంవత్సరాలుగా పరిపాలన చేస్తున్నారు. బీసీలను అన్ని రంగాలలోను అణచివేయడమే జరుగుతున్నది. గత ఏడాది బడ్జెట్లో దేశంలోని 80 కోట్ల మంది బీ సీ జనాభాకు కేవలం 3000 కోట్లు కేటాయించారు ఈసారి మొన్న జరిగిన బడ్జెట్ సమావేశాల్లో మరో 500 కోట్లు తగ్గించి కేవలం 2500 కోట్లు మాత్రమే బిసి సంక్షేమానికి కేటాయించారు పెరగవలసిన బడ్జెట్ను తగ్గిస్తూ వస్తున్నారు ఈ 2500 కోట్ల బడ్జెట్ ద్వారా 80 కోట్ల మందికి ఏడాది పొడవునా నెలకు ?30 రూపాయలు కేటాయించినట్లుగా ఉన్నది రోజుకు 10 పైసలు కేటాయించినట్లుగా ఉన్నది. ఇది పూర్తిగా దేశంలోని బీసీ కులాల వారి పట్ల వివక్ష కనపడుతున్నది అని అలేఖ్య గారు ఆరోపించారు. ఇప్పటికైనా చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లకై ఈ పార్లమెంటు సమావేశాల్లోబిల్లు ప్రవేశపెట్టాలని మహిళా బిల్లులో 33% గా ఉన్న దాంట్లో 50 శాతం బీసీ మహిళలకు సబ్కోటగా ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా బడ్జెట్ పార్లమెంటు సమావేశాల సందర్భంగా అలేఖ్య గారు కోరినారు ఈ కార్యక్రమంలో బీసి కులాల ఉద్యమ పోరాట సంఘం



సీనియర్ నాయకురాలు కుమ్మరి కోడూరి లీలావతి ప్రజాపతి గారు శ్రీమతి తరిగొప్పుల లక్ష్మీ మహేందర్ గారు శ్రీమతి తోటపల్లి బాలమణి గారు శ్రీమతి మూల రేణుక భాస్కర్ గౌడ్ గారు తదితరులు పాల్గొన్నారు.

# హైన దాడిలో దూడ మృతి

### - ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతు విజయలక్ష్మి..



ప్రజాస్వేచ్ఛ చిగురుమామిడి :

చిగురుమామిడి:మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన కంది విజయలక్ష్మి వ్యవసాయ పొలం వద్ద కట్టేసిన లేగదూడపై హైన దాడి చేసి హతమార్చినట్లు బాధిత రైతు విజయలక్ష్మి విలపిస్తూ తెలిపారు. ఈ సందర్భంగా రైతు విజయలక్ష్మి మాట్లాడుతూ బుధవారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద కట్టేసిన రెండున్నర సంవత్సరాల లేగదుడపై గురువారం తెల్లవారుజామున హైన దాడి చేసి చంపిందన్నారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారాన్ని చేరవేసినట్లు పేర్కొన్నారు. దాదాపు 30 వేల రూపాయలు విలువ చేసే లేగదుడ మృతి చెందడంతో తాము తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కంది విజయలక్ష్మి కోరారు.

# భవన నిర్మాణానికి సెంట్రింగ్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మద్దతూ ర్యాలీ



వికారాబాద్ ,ప్రజాస్వేచ్ఛ

వికారాబాద్ మున్సిపల్ పరిధిలో సెంట్రింగ్ పనులు నిలిపి వేస్తున్నట్టు సంఘం అధ్యక్షులు గుర్రాల. నాగరాజు తెలిపారు. తేదీ 14-02-2025 నుండి 17-02-225 వరకు, సెంట్రింగ్ పనులు లిఫ్ట్ చేస్తున్నట్టు సంఘం అధ్యక్షులు గుర్రాల నాగరాజు తెలిపారు. నిత్యావసర ధరలు పెరిగి తాము పాత రేట్ల ప్రకారం పనులు చేస్తున్నందుకు తమ కుటుంబలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు సెంట్రింగ్ ధరలు పెంచకపోతే జీవనం కొనసాగడం కష్టం అని దీనికి భవన యజమానులు మద్దత్తు కోరుకుంటూ స్లాబ్ ఒక ఫీట్ కు 130 ధర చెల్లించాలని కోరుకుంటూ ఆలంపల్లి నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ తీసి కరపత్రలు పంచడం జరుగుతుంది కాబట్టి ఇట్టి విషయన్ని గమనించగలరు.

# స్నేహితురాలి కూతురు వివాహానికి ఆర్థిక సహాయం అందజేసిన పూర్వ విద్యార్థులు.



ప్రజాస్వేచ్ఛ, భీమారం

మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ పరిధిలోని భీమారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996- 97 పదవ తరగతి విద్యార్థులు తమ స్నేహితురాలి కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి 50 వేల రూపాయలను అందజేసి బాసటగా నిలిచారు. ఈ విషయాన్ని శుభకార్యానికి హాజరైన ఏ.శ్రీనివాస్, సి.రవీందర్, టి. శంకర్, ఎన్.పేతురు,ఐ.సుజాత,భారతి, డి. రాధిక, కే.రాధిక,డి.శంకర్, కృష్ణమూర్తి,రవి,కొమురయ్య , హర్షద్వానాలతో సంతోషాన్ని పంచుకున్నారు.

# కాంగ్రెస్ తోనే బీసీల జీవితాల్లో గుణాత్మకమైన, విప్లవాత్మకమైన మార్పు

### -టిపిసిసి నాయకులు బట్టు జగన్ యాదవ్



నాంపల్లి, ప్రజాస్వేచ్ఛ

గురువారం నాడు టి పిసిసి బట్టు జగన్ మీడియాతో మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేలో పాల్గొనని వారికి మరొక్కసారి అవకాశం కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం గొప్పదని సర్వే లో పాల్గొనని 3.1 శాతం వివరాల నమోదు కోసం మరో విడత సర్వే ఈ నెల 16 నుండి 28 వరకూ నిర్వహించి స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగ నియామకాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయానికి చట్టబద్ధత చేకూర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం అన్నారు. అసెంబ్లీ లో బీసీ బిల్లు అమేదించాలన్న ముఖ్యమంత్రి నిర్ణయం గొప్పదని ఇది దశాబ్ధాల బీసీ ఉద్యమాలకు, పోరాటాలకు దక్కిన గౌరవమని జగన్ యాదవ్ అన్నారు. బీసీ ల సామజిక ఆర్థిక రాజకీయ గుణాత్మక విప్లవాత్మక మార్పులు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే సాధ్యమని ఆ వర్గాల ప్రతినిధిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, కేబినెట్ మంత్రులకు, ఎంఎల్ఏ కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ ప్రక్రియలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు ఇంతటి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ప్రజా ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి ప్రతి బీసీ బిడ్డ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

# రంగారెడ్డి జిల్లా కోర్టులో జడ్జిపై చెప్పు విసిరిన ముద్దాయి





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**-పోక్సో కేసులో ఒక వ్యక్తికి జీవితఖైదు**

**-తనను దోషిగా ప్రకటించడాన్ని జీర్ణించుకోలేక చెప్పు విసిరిన వైనం**

**-నేరస్తుడిని చితకబాదిన న్యాయవాదులు**

**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**

హైదరాబాద్ లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. జీవిత ఖైదు పడిన ఓ నేరస్తుడు కోపం తట్టుకోలేక జడ్జి పట్ల దురుసుగా ప్రవర్తించాడు. పోక్సో కోర్టు న్యాయమూర్తిపై చెప్పు విసిరాడు. పోక్సో కేసులో తనను జడ్జి దోషిగా ప్రకటించడంతో జీర్ణించుకోలేకపోయాడు. జడ్జిపై చెప్పు విసిరాడు. జరిగిన ఘటనతో అక్కడున్న వారంతా షాక్ కు గురయ్యారు. కోర్టులో ఉన్న న్యాయవాదులు నేరస్తుడిని పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# జడ్జిపై దాడికి దిగిన నిందితుడు

## దాన్ని ఖండిస్తున్న టీఎంవీఎఫ్ అధ్యక్షురాలు స్వర్ణలత

**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**

పోలీస్ స్టేషన్ జగదీర్ గుట్ట కు చెందిన నిందితుడు కరణ్ సింగ్ అనే వ్యక్తి మంగళవారం రోజున ఒక కేసులో యావజ్జీవ కరగర శిక్షణ ఖరారైంది. అదే నిందితుడుపై ఉన్న మరొక కేసులో ఈరోజు కూడా శిక్ష ఖరారు చేశారు గౌరవనీయులైన 9వ అదనపు జిల్లా జడ్జి గారు తీర్పు చెప్పిన సందర్భంలో నిందితుడు తన ఖాళీ చెప్పులు తీసి గౌరవ జడ్జి వైపు విసరడం జరిగింది దాంతో కోర్టు ఆవరణ మొత్తం భయభ్రాంతులకు గురి అయింది నిందితుడిని యధాపిన ఆగకుండా గట్టిగా అరుస్తూ జడ్జి గారిని తిట్టడం జరిగింది.

ఒక శ్రీ మూర్తిగా ఒక న్యాయమూర్తిగా తన బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళపై చెప్పు విసరడం జరిగింది.. నిందితుడికి తక్షణమే శిక్ష ఖరారు చేయవలసిందిగా టీఎంవీపి ప్రాస అధ్యక్షురాలుగా విన్నపించడం జరిగింది ఈరోజు మధ్యాహ్నం 12 నుండి 12:30 గంటల మధ్య కాలంలో జరిగిన ఈ సంఘటనపై ఆమె స్పందిస్తూ జడ్జి గారిని కలిసి పరామర్శించడం జరిగింది

టీఎంవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గానే కాకుండా ఆమె ఒక న్యాయమూర్తిగా కూడా గౌరవనీయులైన జడ్జి గారిని పరామర్శిస్తూ తమ వంతు ఇలాంటి సహాయ సహకారాలు అందించడానికి అందుబాటులో ఉంటామని చెప్పడం జరిగింది ఆమె జడ్జి గారితో మాట్లాడుతూ ఈరోజు జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇలా జరగడం బాధాకరం అని చెప్పడం జరిగింది.. బాధాకరం అని భావిస్తున్నాను అని అని స్త్రీలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ పూజించబడతారు ఇలాంటి సందర్భంలో ఒక స్త్రీగా ఒక న్యాయదేవతకు జరిగిన అవమానం శుభ్రంగా ఖండిస్తున్నామని చెప్తూ సదరు నిందితుడిపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడానికి వచ్చిన ఆఫీసర్ కి ఒక విషయం విన్నపించడం జరిగింది ఇది మహిళ మూర్తిగా తనకి మరియు న్యాయ వ్యవస్థకు పెద్ద పరువు నష్టం కింద కేసు నమోదు చేయమని చెప్పడం జరిగింది అలాగే గౌరవనీయులైన బార్ అసోసియేషన్ రేపు రంగారెడ్డి కోర్టు విధులను నిలిపివేయడం జరుగుతుందని విన్నవించినట్టు ఆమె చెప్పుకొచ్చారు

**ఇట్లు**

శ్రీమతి స్వర్ణలత వద్దిరాజు
న్యాయమూర్తి H.c లీగల్ సెల్ కన్వీనర్ తెలంగాణ



టీఎంవీఎఫ్ అధ్యక్షురాలు స్వర్ణలత

# వెట్టి చాకిరిని నిర్మూలిద్దాం


**- జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రెటరీ రజిని**




**ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 13. వనపర్తి ప్రతినిధి**

వనపర్తి జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ న్యాయ మిషన్ వారు రూపొందించిన పోస్టర్లను,వనపర్తి జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రెటరీ రజిని జిల్లా కోర్టు ఆవరణలో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు చిన్నమ్మ థామస్ తో కలిసి పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ,బాండడ్ లేబర్ కు వ్యతిరేకంగా ఫిబ్రవరి మాసం మొత్తం అవగాహన కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా చైల్డ్ లేబర్ మరియు బాండెడ్ లేబర్ ఉన్నట్లయితే జిల్లా న్యాయ సేవా సంస్థ ప్రతినిధులకు లేదా 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ కు లేదా పోలీసు 100 నెంబర్లకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బాల గంగయ్య, ఆంజనేయులు, రఘు,శంకర్,సఖి కేంద్రం నిర్వాహకురాలు కవిత,లీగల్ కౌన్సిలర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు పూర్వ విద్యార్థుల ఆశీర్వాదం



**ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 13 వనపర్తి ప్రతినిది**

పెద్దమందడి మండలం, మద్దిగట్ల గ్రామానికి చెందిన, చాపల లక్ష్మీ నాగిరెడ్డి దంపతుల కూతురు,పర్ణిక కిషోర్ రెడ్డి వివాహ వేడుక గురువారం కొత్తకోటలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిపారు. 1989 – 90 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన నాగిరెడ్డి కూతురి వివాహ వేడుకకు,పూర్వ విద్యార్థులను ఆహ్వానించారు. కాగా 35 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న మిత్రులు ఉద్యోగ,ఉపాధి నిమిత్తం దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. అయినప్పటికీ ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకునేందుకు ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని శుభ,అశుభ కార్యాలతో పాటు ప్రతినిత్యం సమాచారాన్ని గ్రూపులో పెట్టడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. నాగిరెడ్డి కూతురు వివాహ వేడుకకు గ్రూపులో వెడ్డింగ్ కార్డ్ పెట్టడంతో పాటు ప్రత్యేకంగా ఫోన్ చేసి ఆహ్వానించడంతో అందుబాటులో ఉన్న వారంతా పెళ్లికి హాజరయ్యారు. 35 ఏళ్ల నాటి మిత్రులు వివాహ వేడుకలో కలుసుకొని నూతన వధూవరులను ఆశీర్వదించడంతో నాగిరెడ్డి దంపతులతో పాటు నూతన దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శారదా చారి,నాగరాణి,శోభారాణి, జహెదా బేగం, రామచంద్రారెడ్డి, రామచంద్రయ్య గౌడ్,శ్రీనివాస యాదవ్,కొండన్న సాగర్,రాజ వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజేతలకు నగదు అందజేసిన.. కాంగ్రెస్ నాయకులు వెంకట్ గౌడ్



**ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 13, మెదక్ జిల్లా ప్రతినిధి( రాము)**

పోతంశెట్టిపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్ 03 విజేతలకు రూ. 25000 నగదు అందజేసిన కాంగ్రెస్ నేత నాయిని వెంకట్ గౌడ్ (గజిని). కొల్చారం మండలం పోతాంశెట్టిపల్లి గ్రామంలో పిపిఎల్ సీజన్-03 టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. ఫైనల్ మ్యాచ్లో విన్నర్ గా గెలుపొందిన విజేతలకు అప్పాజీపల్లి మాజీ సర్పంచ్ కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయిని వెంకట్ గౌడ్ (గజిని) 25000 రూపాయలు నగదు విన్నర్ టీం సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ గౌడ్ మాట్లాడుతూ క్రీడల్లో ఓడిన గెలిచిన క్రీడా నైపుణ్యం అభివృద్ధి చెందుతుంది. క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడుతాయి, యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడలు క్రమశిక్షణకు దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లబోయిన దుర్గేష్ ముదిరాజ్, రామకృష్ణ, ఉదయ్, విన్నర్ టీం సభ్యులు యువకులు పాల్గొన్నారు.

## బిజినెస్

### అదిరేలా ఇండిగో వాలెంటైన్స్ డే ఆఫర్లు.. రెండు రోజులే అవకాశం




ఇండిగో లవ్ సీజన్‌ను ప్రత్యేక వాలెంటైన్స్ డే సేల్‌తో జరుపుకుంటుందని ఆ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ప్రత్యేక డిస్కౌంట్‌లతో ప్రేమ జంటలు ప్రశాంతంగా ప్రయాణించేందుకు అనువుగా ప్లాన్స్‌ను రూపొందించినట్లు వివరిస్తున్నారు. ఈ ఆఫర్లలో భాగంగా ఇద్దరు ప్రయాణీకులకు బుకింగ్‌లపై బేస్ ఛార్జీలపై 50 శాతం వరకు డిస్కౌంట్లను ఎయిర్‌లైన్ ప్రకటించింది. ఈ పరిమిత కాల ఆఫర్ ఫిబ్రవరి 12, 2025 (00:01 గంటలు) నుంచి ఫిబ్రవరి 16, 2025 (23:59 గంటలు) వరకు ఎంపిక చేసిన దేశీయ మరియు అంతర్జాతీయ మార్గాల్లో అందుబాటులో ఉంటుంది. ప్రయాణ తేదీలు బుకింగ్ తేదీ తర్వాత కనీసం 15 రోజులు ఉండాలి.ఇండిగో వెబ్‌సైట్, మొబైల్ యాప్, ఇండిగో 6ఈ స్కై, ఇష్టపడే ప్రయాణ భాగస్వాములతో సహా బహుళ బుకింగ్ ఛానెల్‌ల ద్వారా కస్టమర్‌లు ఈ డిస్కౌంట్‌లను పొందవచ్చు. విమాన ఛార్జీలతో డిస్కౌంట్‌లతో పాటు ఇండిగో వివిధ రకాల ప్రయాణ యాడ్-ఆన్‌లపై తగ్గింపులను అందిస్తుంది. ప్రయాణికులు నిర్దిష్ట మార్గాల్లో దేశీయ, అంతర్జాతీయ విమానాల కోసం ప్రీ-పెయిడ్ అదనపు సామగ్రి చార్జీలపై 15 శాతం వరకు తగ్గింపును పొందవచ్చు, అలాగే ప్రామాణిక సీట్ల ఎంపికపై 15 శాతం తగ్గింపును పొందవచ్చు. అదనపు సౌకర్యాన్ని ఇష్టపడే వారికి దేశీయ సెక్టార్‌లకు రూ.599, అంతర్జాతీయ మార్గాలకు రూ.699 నుండి ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఎక్స్‌ఎల్ సీట్లు అందుబాటులో ఉంటాయి. అలాగే ముందస్తుగా బుక్ చేసుకున్న భోజనాలపై 10 శఆతం తగ్గింపును కూడా అందిస్తోంది ముఖ్యంగా ఫాస్ట్ ఫార్వర్డ్ సేవలపై 50 శాతం వరకు తగ్గింపును అందిస్తుంది. 6ఈ ప్రైమ్, 6ఈ సీట్ %ఢ% ఈట్ వంటి ఇండిగో బండిల్డ్ సేవలపై 15 శాతం వరకు అదనపు తగ్గింపులు అందుబాటులో ఉన్నాయి. అదనపు ప్రోత్సాహకంగా ఇండిగో ఫిబ్రవరి 14, 2025న 'ఫ్లాష్ సేల్'ను నిర్వహిస్తుంది. ఆ రోజు మొదటి 500 బుకింగ్‌లకు అమ్మకపు ధరపై అదనంగా 10 శాతం తగ్గింపును అందిస్తుంది.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు..

బంగారం కొనాలనుకుంటున్నారా? బంగారం ధరలు రోజు రోజుకు పెరుగుతూ ఆల్‌టైమ్ గరిష్టానికి చేరుకుంటున్నాయి. ఇటీవల 87 వేల పైకి చేరిన బంగారం ధర కొద్దిగా కిందకు దిగి వచ్చింది. ఈ నేపథ్యంలో (ఫిబ్రవరి 13న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 86, 660కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 79, 390కి చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 86, 810కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 79, 540కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 86, 660కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 79, 390కి చేరింది. వెండి ధరలు కిలోకి వంద రూపాయల మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు



తెలుసుకుందాం.

**దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)**

హైదరాబాద్‌లో రూ. 86, 660, రూ. 79, 390
విజయవాడలో రూ. 86, 660, రూ. 79, 390
ఢిల్లీలో రూ. 86, 810, రూ. 79, 540
ముంబైలో రూ. 86, 660, రూ. 79, 390
వడోదరలో రూ. 86, 710, రూ. 79, 490
కోల్‌కతాలో రూ. 86, 660, రూ. 79, 390
చెన్నైలో రూ. 86, 660, రూ. 79, 390
బెంగళూరులో రూ. 86, 660, రూ. 79, 390
కేరళలో రూ. 86, 660, రూ. 79, 440
పుణెలో రూ. 86, 660, రూ. 79, 390

**ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)**

హైదరాబాద్‌లో రూ. 106, 900
విజయవాడలో రూ. 106, 900
ఢిల్లీలో రూ. 99, 400
చెన్నైలో రూ. 106, 900
కోల్‌కతాలో రూ. 99, 400
కేరళలో రూ. 106, 900
ముంబైలో రూ. 99, 400
బెంగళూరులో రూ. 99, 400
వడోదరలో రూ. 99, 400
అహ్మదాబాద్‌లో రూ. 99, 400

## పల్సర్‌లో కూడా సీఎన్‌జీ వెర్షన్ షురూ..

కంప్రెస్ట్ నేచురల్ గ్యాస్ ( సీఎన్జీ) అనేది పర్యావరణానికి హాని కలిగించని ఇంధనం. దీన్ని కార్లలో ఎక్కువగా వినియోగిస్తారు. దీని నుంచి కాలుష్య ఉద్గారాలు వెలువడవు. తద్వారా పర్యావరణానికి రక్షణ కలుగుతుంది. పెట్రోలు, డీజిల్ తో పోల్చిత్తే సీఎన్జీ ధర తక్కువ కావడంతో వినియోగదారులకు ఉపయోగంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో దీనితో నడిచే బైక్ ను బజాజ్ కంపెనీ రూపొందించింది. బజాజ్ పల్సర్ 150 సీఎన్జీ బైక్ సొగసైన లుక్ తో ఆకట్టుకుంటోంది. పల్సర్ సిరీస్ లోని ఐకానిక్ స్టైల్ కు అనుగుణంగా తయారైంది. అధిక నాణ్యత కలిగిన పరికరాలు, చక్కగా అమర్చిన భాగాలు, ఆధునాతన రూపం, అల్లాయ్ వీల్స్, డిస్క్ బ్రేకులతో ఆకర్షణీయంగా ఉంది. దీనిలోని డిజిటల్ ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్ లో వేగం, ఇంధనం గేజ్, ట్రిప్ సమాచారమంతా తెలుసుకోవచ్చు. ఎర్గోనామిక్ సీటు, ఎడ్జెస్టబుల్ సస్పెన్షన్ బాగున్నాయి. నగరాలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని రకాల రోడ్లపైనా పరుగులు తీయడం దీని ప్రత్యేకత.సీఎన్జీ శక్తితో పనిచేసే 149.5 సీసీ ఇంజిన్ ను కొత్త బైక్ లో ఏర్పాటు చేశారు. దీని నుంచి 14 బీహెచ్పీ, 13.25 గరిష్ట టార్క్ విడుదల అవుతుంది. సంప్రదాయ పెట్రోలు ఇంజిన్ల కంటే ఎక్కువ సామర్థ్యంలో పనిచేస్తుంది. పెట్రోలుతో పోల్చితే ప్రయాణానికి ఖర్చును గణనీయంగా తగ్గించుకోవచ్చు. సంప్రదాయ పెట్రోలు వాహనం మాదిరిగానే పనితీరు ఉంటుంది. ఇంధన ఖర్చులను ఆదా చేయాలనుకునే వారికి మంచి ఎంపిక అని చెప్పవచ్చు. సీఎన్జీ టెక్నాలజీ కారణంగా నిర్వహణ ఖర్చులతో పాటు కాలుష్య




ఉద్గారాల విడుదల తగ్గుతుంది. దాని వల్ల పర్యావరణానికి ఎలాంటి ఇబ్బంది కలగదు. పెట్రోలుతో పోల్చితే సీఎన్జీ శుభ్రమైన ఇంధనం. పర్యావరణానికి హాని కలిగించకుండా రైడింగ్ కోరుకునే వారికి బజాజ్ పల్సర్ 150 సీఎన్జీ ఎంతో అనుకూలంగా ఉంటుంది. మిగిలిన బజాజ్ వాహనాల మాదిరిగానే సీఎన్జీ వాహనాన్ని కూడా వినియోగదారులకు అందుబాటులో ధరలో తీసుకురానున్నట్టు సమాచారం.

## ఆర్‌సీబీ కెప్టెన్‌గా రజత్ పటీదార్

**-ప్రకటించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు**


రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) తమ నూతన సారథిగా టీమిండియా యువ బ్యాటర్ రజత్ పటీదార్‌ను ఎంపిక చేసింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్‌సీబీని రజత్ పటీదార్ నడిపిస్తాడని బుధవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ తిరిగి ఆర్‌సీబీ సారథ్య బాధ్యతలు చేపడుతాడని ప్రచారం జరిగినా.. మళ్లీ సారథిగా కొనసాగేందుకు అతను సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. దాంతోనే రజత్ పటీదార్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. విరాట్ కోహ్లీ అనంతరం ఫాఫ్ డుప్లెసిస్ ఆర్‌సీబీ సారథ్య బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. గత మూడు సీజన్లలో అతనే జట్టును నడిపించాడు. అయితే ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు ఆర్‌సీబీ.. ఫాఫ్ డుప్లెసిస్‌ను రిటైన్ చేసుకోలేదు. వేలంలోనూ తిరిగి కొనుగోలు చేసే ప్రయత్నం చేయలేదు. దాంతో కొత్త సారథిని ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఆర్‌సీబీకి ఏర్పడింది. జట్టులో



కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్ వంటి సీనియర్ ఆటగాళ్లున్నా.. ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ రజత్ పాటిదార్‌కే సారథ్య బాధ్యతలు అప్పగించింది. ఐపీఎల్ 2021 సీజన్‌లో ఆర్‌సీబీలోకి వచ్చిన రజత్ పాటిదార్ ఇప్పటి వరకు 27 మ్యాచ్‌లు ఆడి 34.74 సగటుతో 799 పరుగులు చేశాడు. గత సీజన్‌లో 15 మ్యాచ్‌ల్లో ఐదు హాఫ్ సెంచరీలతో 395 పరుగులు చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో మధ్యప్రదేశ్‌కు సారథిగా వ్యవహరిస్తున్న రజత్ పటీదార్.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 10 మ్యాచ్‌ల్లో 428 పరుగులు చేశాడు. రజత్ పటీదార్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేయడాన్ని విరాట్ కోహ్లీ సమర్థించాడు. గత కొన్నేళ్లుగా రజత్ పటీదార్ ఆటగాడిగా ఎంతో మెరుగయ్యాడని చెప్పాడు. దేశవాళీ క్రికెట్‌లో మధ్యప్రదేశ్ జట్టును రజత్ పటీదార్ అద్భుతంగా నడిపించాడని, ఆర్‌సీబీని నడిపించే నైపుణ్యం అతనికి ఉందని కోహ్లీ అభిప్రాయపడ్డాడు. 'గత రెండు-మూడేళ్లుగా రజత్ పటీదార్ ఆటగాడిగా ఎంతో మెరుగయ్యాడు. భారత్ తరఫున ఆడే అవకాశం కూడా అతనికి వచ్చింది. అన్ని లెవెల్స్‌లో అతని ఆట కూడా ఎంతో మెరుగైంది. తన రాష్ట్ర జట్టును రజత్ పటీదార్ నడిపించిన విధానం..కెప్టెన్‌గా అతను తీసుకున్న బాధ్యత ఫ్రాంచైజీ జట్టును నడిపించడానికి కావాల్సిన నైపుణ్యం ఉందనే విషయాన్ని తెలియజేస్తోంది.'అని విరాట్ కోహ్లీ చెప్పుకొచ్చాడు.

## రోహిత్ పై సంచలన కామెంట్స్ చేసిన గబ్బర్

భారత క్రికెట్ జట్టుకు అనేక విజయాలను అందించిన శిఖర్ ధావన్ తన ఆట జీవితంలో ఎదుర్కొన్న గాయాలు, స్లెడ్జింగ్ సంఘటనలు, మైదానంలో చూపిన ధైర్యాన్ని తాజాగా గుర్తుచేసుకున్నాడు. తన దేశం కోసం ఆడేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నానని, గాయాలు అయినా కూడా తాను వెనుకడుగు వేయలేదని ధావన్ వెల్లడించాడు. 2019 ఐసిసి వరల్డ్ కప్‌లో ధావన్ తన నిబద్ధతను చూపించిన అద్భుతమైన ఉదాహరణను ప్రదర్శించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో అతని ఎడమచేయికి తీవ్రగాయం అయింది. గంటకు 150 కి.మీ. వేగంతో వచ్చిన బంతి అతని బొటనవేలికి తాకి విరిగిపోయింది. 'నాకు నొప్పి అనిపించింది, అది విరిగిందని కూడా తెలుసు. నా చేయి పోయిందని రోహిత్ శర్మకు చెప్పాను, కానీ అతను 'ఇప్పుడే ఆడాలి, మనమిద్దరం కలిసి మ్యాచ్‌ను ఆధిపత్యం చెలాయించాలి' అని అన్నాడు," అని ధావన్ గుర్తు చేసుకున్నాడు.గాయం ఉన్నప్పటికీ, పెయిన్




కిల్లర్ మందులు వేసుకుని, స్ప్రేలు కొట్టి బ్యాటింగ్ కొనసాగించిన ధావన్, చివరకు 109 బంతుల్లో 117 పరుగులు చేసి జట్టుకు అమూల్యమైన ప్రదర్శన అందించాడు. కానీ ఈ గాయం కారణంగా అతను ప్రపంచ కప్ నుంచి వైదొలగాల్సి వచ్చింది. 2019 వరల్డ్ కప్ మాత్రమే కాదు, గతంలో శ్రీలంక, ఆస్ట్రేలియాల తరహాలోనూ ధావన్ గాయాలతోనూ ఆడాడు. తాను మూడుసార్లు విరిగిన చేతితోనూ బ్యాటింగ్ చేయాల్సి వచ్చిందని, ప్రతి సారి నొప్పిని అధిగమించి జట్టుకు సేవ చేయాలని అనుకున్నానని ధావన్ తెలిపాడు. బహుశా చిన్నప్పటి అనుభవాల వల్లే నొప్పిని తట్టుకునే శక్తి తనకు ఏర్పడింది అని నవ్వుతూ చెప్పాడు. ఆస్ట్రేలియా ఆటగాళ్లతో తాను ఎదుర్కొన్న మాటల యుద్ధాలను ధావన్ గుర్తు చేసుకున్నాడు. "షేన్ వాట్సన్, బ్రాడ్ హాడిన్‌లతో చాలా సార్లు స్లెడ్జింగ్ యుద్ధాలు చేశాను. కానీ అవన్నీ మైదానంలో మాత్రమే ఉండేవి," అని చెప్పాడు. ఆ స్టేడియం గేట్లు దాటిన తర్వాత మరేదీ గుర్తుండదు, క్రీడాస్ఫూర్తి కొనసాగుతుందని చెప్పిన ధావన్, "ఈరోజు వాట్సన్‌ను కలిస్తే, ఆ సంఘటనల గురించి నవ్వుకుంటాం. ఐపీఎల్‌లో మేము అందరం కలిసిపోతాం," అని వివరించాడు.

## స్పోర్ట్స్

### ధోనీ రికార్డ్ బద్దలు కొట్టిన రోహిత్ శర్మ!



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చరిత్ర సృష్టించాడు. వన్డే క్రికెట్‌లో అత్యధిక సిరీస్‌లను క్లీన్ స్వీప్ చేసిన తొలి భారత సారథిగా రోహిత్ శర్మ చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో టీమిండియా దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ రికార్డ్‌ను అధిగమించాడు. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన మూడో వన్డేలో టీమిండియా 142 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. రోహిత్ శర్మ సారథ్యంలో టీమిండియా ఇప్పటి వరకు నాలుగు ద్వైపాక్షిక సిరీస్‌లను క్లీన్ స్వీప్ చేసింది. వెస్టిండీస్, శ్రీలంక, న్యూజిలాండ్‌తో పాటు ఇంగ్లండ్‌పై సిరీస్‌లను రోహిత్ సేన క్లీన్ స్వీప్ చేసింది. గతంలో విరాట్ కోహ్లీ, ఎంఎస్ ధోనీల నాయకత్వంలో టీమిండియా మూడేసి సార్లు ప్రత్యర్థులను క్లీన్ స్వీప్ చేసింది. అంతేకాకుండా 4 వేర్వేరు దేశాలపై క్లీన్ స్వీప్ చేసిన తొలి కెప్టెన్‌గా రోహిత్ శర్మ నిలిచాడు. వన్డే క్రికెట్‌లో 14 ఏళ్లలో అత్యధిక క్లీన్ స్వీప్‌లను సాధించిన జట్టుగా నిలిచింది. టీమిండియా గత 14 ఏళ్లలో 12 సార్లు వన్డే సిరీస్‌లను క్లీన్ స్వీప్ చేసింది. భారత్ తర్వాత న్యూజిలాండ్ 10 క్లీన్ స్వీప్‌లతో రెండో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 356 పరుగులకు ఆలౌటైంది. శుభ్‌మన్ గిల్ (102 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లతో 112) శతకంతో చెలరేగగా.. విరాట్ కోహ్లీ(55 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 52), శ్రేయస్ అయ్యర్(64 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 78) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్(4/64) నాలుగు వికెట్లు తీసాడు. రెండో వన్డేలో విధ్వంసకర శతకంతో చెలరేగిన రోహిత్ శర్మ(1).. ఈ మ్యాచ్‌లో మాత్రం రెండో బంతికే ఔటయ్యాడు. అనంతరం లక్ష్యఛేధనకు దిగిన ఇంగ్లండ్ 34.2 ఓవర్లలో 214 పరుగులకు కుప్పకూలి ఓటమిపాలైంది. టామ్ బాంటన్(41 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38), గస్ అట్కిన్సన్(19 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 38) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు.



# అనారోగ్యం వల్ల ఒక్కోసారి వైవాహిక జీవితంలో భారీ మూల్యం

## విడాకులపై సమంత కామెంట్

అక్కినేని నాగచైతన్య, సమంత 2017లో ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఈ జంట... 2021లో విడాకులు తీసుకుంది. అయితే... విడాకులకు కారణాలు వీరిద్దరూ వేర్వేరుగా చెప్పడమే కొన్ని సార్లు చర్చనీయాంశం అవుతోంది. ఆ మధ్య ఓ పాడ్ కాస్ట్ లో నాగచైతన్య 'తాను సమంత పరస్పర అంగీకారంతోనే విడాకులు తీసుకున్నామ'ని చెప్పాడు. మాకున్న వ్యక్తిగత కారణాలతో ఎవరి మార్గంలో వారు ప్రయాణం చేయాలని అనుకున్నాం. అందుకే విడాకులు తీసుకున్నాం' అని స్పష్టం చేశాడు. తాజాగా సమంత మాత్రం విడాకులు విషయంలో వేరే వర్షన్ ను చెప్పింది. ప్రతి మనిషి మానసికంగానే కాకుండా శారీరకంగానూ ఎంతో ఆరోగ్యంగా ఉండాలి. అలా లేని పక్షంలో దాని ప్రభావం వైవాహిక జీవితం మీద పడుతుందని తెలిపింది. జీవిత భాగస్వామి ఎంత విశాల హృదయుడైనా... ఎంత మనసున్నవాడైనా... ఒక్కోసారి పార్టనర్ అనారోగ్యం కారణంగా వారి మధ్య గ్యాప్ ఏర్పడుతుందని ఇన్ డైరెక్ట్ గా చెప్పింది. లైఫ్ పార్టనర్ పట్ల మనకు ఉన్న ప్రేమను వ్యక్తం చేయడంలో ఒక్కోసారి అనారోగ్యం అడ్డుపడుతూ ఉంటుందని, దాంతో భారీ మూల్యం చెల్లించాల్సి రావొచ్చని నర్మగర్భంగా సెలవిచ్చింది. మొత్తం మీద తన అనారోగ్యమే విడాకులకు పరోక్షకారణమని చెప్పకనే సమంత చెప్పేసింది. ఇదిలా ఉంటే ఇటీవల శోభితా ధూళిపాలను వివాహం చేసుకున్న నాగచైతన్య 'తండేల్' విజయంతో ముందుకు సాగిపోతున్నాడు. అలానే... సమంత విడాకుల అనంతరం వెబ్ సీరిస్ మీద దృష్టి పెట్టి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుని నటిగా కొనసాగుతోంది. ప్రస్తుతం నిర్మాతగానూ తన సత్తాను చాటాలని తహతహలాడుతోంది.

# ఆ రెండు సినిమాల్లో నటించడం నా అదృష్టం

నిధీ అగర్వాల్ మంచి ఫామ్‌లో ఉన్నారు. సక్సెస్‌లు లేకపోయినా అవకాశాలు మాత్రం బాగానే వరిస్తున్నాయి. ఇప్పటికే ఆమె రెండు భారీ చిత్రాల్లో అగ్ర హీరోల సరసన నటిస్తోంది. ప్రస్తుతం 'హరిహర వీరమల్లు', 'ది రాజాసాబ్'తో ఈ ఏడాది ప్రేక్షకులకు వినోదాన్ని అందించనుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె తన అప్‌కమింగ్ సినిమాల గురించి మాట్లాడారు. 2022లో గ్యాప్ తీసుకోవడానికి గల కారణాన్ని వివరించారు. 'హరిహర వీరమల్లు' లో నా పాత్ర ఇప్పటివరకు నేను చేసిన వాటిల్లో అత్యుత్తమమైనది. ఆ పాత్ర కోసం గుర్రపు స్వారీ, క్లాసికల్ డ్యాన్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. కథక్ నేర్చుకున్నాను. నా కల నిజమైంది. అదృష్టవంతురాలిని అని అనిపించింది. అలాగే హర్రర్ సినిమాలంటే గతంలో భయం ఉండేది. అందుకే 'ది రాజా సాబ్' చేయాలనుకున్నాను. సెట్‌లో స్క్రిప్ట్ చదువుతున్నప్పుడు కూడా అందరం నవ్వుతూనే ఉన్నాం" అని అన్నారు. సెట్‌లో విషయానికొస్తే.. పవన్ కల్యాణ్, ప్రభాస్ నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. పవన్ సెట్స్‌లో ఉన్నప్పుడు ఎంతో ఏకాగ్రతతో ఉంటారు. యాక్షన్ చెప్పగానే పూర్తిగా పాత్రలోకి వెళ్లిపోతారు. చుట్టూ ఏం జరుగుతున్నా పట్టించుకోరు. ఆ సన్నివేశంపై మాత్రమే దృష్టిపెడతారు. ఈ లక్షణాన్ని నేను కూడా అలవాటు చేసుకోవాలి. ప్రభాస్ ఫన్నీ పర్సన్. ఈ రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తాయా అని ఆతురతగా ఎదురుచూస్తున్నా" అని అన్నారు.





# అతడు నన్ను ఎంతో వేధించాడు

దక్షిణాది చిత్రపరిశ్రమలో కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ ఐశ్వర్య రాజేష్. అచ్చ తెలుగు అమ్మాయి అయినప్పటికీ కోలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ డమ్ సంపాదించుకున్న ముద్దుగుమ్మ. ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో తెలుగులో భారీ విజయాన్ని అందుకుంది. డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య తన సినీ కెరీర్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. తన తల్లి నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానని తెలిపింది. చిన్నతనంలోనే తన తండ్రి చనిపోయారని.. దీంతో అమ్మ ఒక్కరే ఎంతో కష్టపడి తమను పెంచిందని.. ఈ ప్రయాణంలో ఆమె మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడిందని తెలిపింది. చిన్న వయసులోనే పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేశానని.. ఆ తర్వాత సినీరంగంలోకి అడుగుపెట్టినట్లు చెప్పుకొచ్చింది. రిలేషన్ షిప్ గురించి మాట్లాడుతూ.. లవ్ కంటే కూడా బ్రేకప్ అయినప్పుడు వచ్చే బాధ అంటే భయం. ప్రేమించే సమయం కంటే అది మిగిల్చిన బాధ నుంచి బయటకు రావడానికే ఎక్కువ సమయం తీసుకుంటాను. గతంలోనూ నేను రిలేషన్ లో ఉన్నానని తెలిపింది. సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఓ వ్యక్తిని ప్రేమించానని.. అతడు తనను ఎంతో వేధించాడని.. అంతకంటే ముందు కూడా అలాంటి ప్రేమనే చూశానని.. రిలేషన్ షిప్ లో ఎందుకు ఇలా జరుగుతుందని భయపడ్డానని.. ప్రస్తుతానికి ఎంతో సంతోషంగా ఉన్నట్లు చెప్పుకొచ్చింది.

# క్రేజీ ఫొటోలతో కుర్రాళ్లను కవ్విస్తున్న చిలసౌ బ్యూటీ..

చిలసౌ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది హీరోయిన్ రుహానీ శర్మ. మొదటి సినిమాతోనే నటిగా మంచి మార్కులు కొట్టేసింది ఈ సిమ్లా సుందరి. ఆ తర్వాత తెలుగులో అందం, అభినయంతో నటనకు ఆస్కారమున్న చిత్రాల్లో నటించింది. తెలుగులో మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకున్న ఈ బ్యూటీ కంటెంట్ ప్రాధాన్యత చిత్రాల్లో నటిస్తుంది. అలాగే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రుహానీ శర్మ ఒక్క ఫోటో పెట్టిందంటే చాలు నెట్టింట లైక్స్ వర్షంలా కురుస్తుంటాయి. మోడ్రన్ డ్రెస్ అయినా.. సంప్రదాయ లుక్ అయినా సరే అభిమానులను కట్టిపడేయం ఈ బ్యూటీకే సాధ్యం అన్నట్లుగా ఉంటుంది. తాజాగా రుహానీ షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట వైరలవుతున్నాయి. మోడ్రన్ డ్రస్సులో ఈ బ్యూటీ ఫోటోలు పిచ్చెకిస్తున్నాయి. మొదటి సినిమాతోనే తెలుగు కుర్రాళ్ల హృదయాలను దోచేసింది హీరోయిన్ రుహానీ శర్మ. చిలసౌ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ అమ్మడు ఆ తర్వాత సరైన క్రేజ్ మాత్రం సొంతం చేసుకోలేదు. టాలీవుడ్ ఇండస్ట్రీలో అడపాదడపా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈ బ్యూటీ..చి.ల.సౌ సినిమా తర్వాత హిట్, డర్టీ హరి, నూటొక్క జిల్లాల అందగాడు, హర్, సైంధవ్, ఆపరేషన్ వాలెంటైన్, శ్రీరంగనీతులు సినిమాలు చేసింది. వీటిలో చి.ల.సౌ, హిట్ సినిమాలు మాత్రమే హిట్ అయ్యాయి. ఇక ఈ అమ్మడు సోషల్ మీడియాలో అందాలతో పిచ్చెక్కిస్తోంది.



Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492